teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

## వైద్య, ఆరోగ్య శాఖలో 1,284 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ

**ఈ నెల 21 నుంచి అక్టోబర్ 8 వరకు దరఖాస్తులకు అవకాశం**




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): నిరుద్యోగులకు తెలంగాణ సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖలో 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు గాను తాజాగా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్

మిగతా 2 లో

ములుగు | సంపుటి : 03 | సంచిక : 138 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 13 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.




# పశ్చిమ బెంగాల్లో ప్రతిష్టంభన

**లైవ్ టెలికాస్ట్ డాక్టర్ల డిమాండ్‌ను తిరస్కరించిన ప్రభుత్వం**

ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ట్రైనీ లేడీ డాక్టర్‌పై హత్యాచారం ఘటనపై ఆందోళన చేస్తున్న వైద్యులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్నది. డాక్టర్లు చర్చలకు రాకపోవడంపై సీఎం మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు.

డాక్టర్లు చర్చలకు రాకపోవడంపై మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం

పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమే : సీఎం మమతా బెనర్జీ




తీన్మార్ న్యూస్ వెబ్ డెస్క్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రజా ప్రయోజనాల కోసం తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమేనని అన్నారు. గత కొన్ని రోజులుగా నిరసన చేస్తున్న జూనియర్ డాక్టర్లను చర్చల కోసం ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే సీఎం మమతా బెనర్జీ హాజరు కావాలని, చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేయాలని డాక్టర్లు డిమాండ్

మిగతా 2 లో




# ఆర్టిఐ యాక్ట్ అంటే ఎంఈఓ కార్యాలయంలో లెక్కే లేదా..!

**హక్కును కాలరాసి.. యాజమాన్యానికి కాపుకాస్తున్నారా..**



చట్టబద్ధమైన బాధ్యతను విస్మరించడంలో అంతర్యం..?

నిర్లక్ష్యంపై అనుమానాలెన్నో.. విచారణ తప్పనిసరి

చట్టాన్ని అమలుపరచని పీఐఓలపై చర్యలు తీసుకోవాలి

పరకాల, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలోని మండల విద్యా కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ఓ ప్రయివేట్ పాఠశాలకు సంబంధించిన ఇట్టి ప్రభుత్వ కార్యాలయం పర్యవేక్షణ, అధీనంలోని, నియంత్రణలోని పలు అంశాలను అనగా ప్రయివేట్ పాఠశాలల అనుమతుల దరఖాస్తు సందర్భములో ప్రభుత్వ

మిగతా 2 లో




## చెరువుల రక్షణపై హైడ్రా ప్రత్యేక దృష్టి

ప్రతీ చెరువు దగ్గర లేక్ ప్రొటెక్షన్ పేరుతో ఇద్దరు గార్డ్స్

ఇప్పటికే 70 చెరువుల వద్ద ఏర్పాటు

.. వివరాలు 2లో

## తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

**పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతలు ముట్టడి**




హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): బంజారాహిల్స్ లోని తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ మహిళా కాంగ్రెస్ నేతలు గురువారం

మిగతా 2 లో



## కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణం మంజూరు

పార్టీలకు అతీతంగా జిల్లాను అభివృద్ధి చేసుకుందాం

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)



ములుగు జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని కోటి మహిళలను కోటీశ్వరులుగా మార్చడానికి మహిళా సంఘాలకు వడ్డీ లేని

మిగతా 2 లో



## స్థానికత రిజర్వేషన్ పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన సర్కార్

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): స్థానికత రిజర్వేషన్ అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తెలంగాణ శాశ్వత నివాసులు రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానిక రిజర్వేషన్ వర్తించవని ప్రభుత్వ నిబంధనను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. తెలంగాణలో చదువుకోలేదన్న కారణంతో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించరాదని

మిగతా 2 లో



## ఉపాధ్యాయుల బదిలీ సంబంధిత జీఓ బ్యాక్

**జులై 24 నాటి ఉత్తర్వులను నిలిపేస్తూ విద్యాశాఖ ఆదేశాలు**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఆన్ డ్యూటీలు, డిప్యుటేషన్ల పేరుతో కోరుకున్న స్థానాలకు బదిలీ చేసేందుకు జారీ

మిగతా 2 లో

## వరదల కారణంగా 28 వేల ఇండ్లకు నష్టం

రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం గుర్తించినట్లు ప్రకటన

దాదాపు 11,500 ఇండ్లు నేలమట్టమయ్యాయని అంచనా

పూర్తిగా ధ్వంసమైన బాధితులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఇటీవల తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసిన వరదలు పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు తీవ్రనష్టాన్ని

మిగతా 2 లో



## హత్యాయత్నం కుట్రలో భాగంగానే నా పై దాడి

దాడిపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

.. వివరాలు 2లో

## హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

**విద్యుత్ కొనుగోలు బిడ్డింగ్లో అనుమతికై ఆదేశాలు**

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): విద్యుత్ కొనుగోళ్ల అంశంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. విద్యుత్ కొనుగోలు బిడ్డింగ్ లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని నేషనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్ డీసీ) ను ఆదేశించింది. ఛత్తీస్ గఢ్ విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన

మిగతా 2 లో



## చెరువుల రక్షణపై హైడ్రా ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ హైదరాబాద్ లోని చెరువుల రక్షణపై హైడ్రా ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతీ చెరువు దగ్గర లేక్ ప్రొటెక్షన్ పేరుతో ఇద్దరు గార్డ్స్ ను పెట్టేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 70 చెరువుల దగ్గర గార్డ్స్ తో నిఘా ఏర్పాటు చేశారు. రాబోయే రోజుల్లో అన్ని చెరువుల దగ్గర నిఘా పెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు హైడ్రా అధికారులు. చెరువుల దగ్గర ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తే వెంటనే హైడ్రా అధికారులకు సమాచారం ఇవ్వాలని కూడా ఆదేశించారు కమిషనర్ రంగనాథ్. గ్రేటర్ పరిధిలో 185 చెరువులు, హెచ్ఎండిఏ పరిధిలో 600 లకు పైగా చెరువులు ఉన్నాయని హైడ్రా బావిస్తోంది.

## స్థానికత రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన సర్కార్

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేసింది. తాజాగా హైకోర్టు తీర్పును తెలంగాణ సర్కార్ సుప్రీం కోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని తెలంగాణ తరపు సీనియర్ నాయకుడు గోపాల్ శంకర్ నారాయణ సుప్రీం కోర్టును కోరింది. తెలంగాణ ప్రభుత్వ పిటిషన్‌ను త్వరలోనే విచారణ జాబితాలో చేరుస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ వెల్లడించారు.

## తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ భవన్ ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. పెద్ద ఎత్తున మహిళా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని, భవన్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పటికే అలర్ట్ గా ఉన్న పోలీసులు భవన్ వద్ద భారీగా మోహరించారు. మహిళా కార్యకర్తలు ముట్టడించేందుకు ప్రయత్నించడంతో వారిని అడ్డుకున్నారు. అయినా కూడా వారు పోలీసులను దాటుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, కార్యకర్తల మధ్య పెనుగులాట జరిగింది. అనంతరం వారు భవన్ ముందు భైటాయించి నిరసన చేశారు. కేటీఆర్ లాంటి వాళ్లనే వదల్లేదని, కౌశిక్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందేనంటూ వారు పట్టుబట్టారు.

## వరదల కారణంగా 28 వేల ఇండ్లకు నష్టం

మొదటి పేజీ తరువాయి

మిగిల్చాయి. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని రోజుల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలు, వరదల వల్ల ఇప్పటి వరకు 28 వేల ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం గుర్తించింది. వీటిలో దాదాపు 11,500 ఇండ్ల వరకు పూర్తిగా దెబ్బతిని నేలమట్టం అయ్యాయని అంచనాకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా జిల్లాల కలెక్టర్లు నివేదిక అందజేశారు. ఇండ్లు పూర్తిగా ధ్వంసమైన బాధితులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర హౌసింగ్ ఆఫీసర్లు గ్రామాల వారీగా ఇండ్లు కూలిన వాటి సమాచారం తెప్పించుకున్నారు. ఇంకా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది.

## హత్యాయత్నం కుట్రలో భాగంగానే నా పై దాడి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని ఆహ్వానిస్తే ఆయన తన గూండాలను తనపైకి పంపించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. ఇది తన హత్యాయత్నం కుట్రలో భాగంగా జరిగిన దాడేనని ఆరోపించారాయన. గూండాలు వచ్చి దాడి చేయడం కరెక్టేనా?. కట్టెలు, కర్రలతో వచ్చి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రీ ప్లాన్డ్‌గా దాడి చేశారు. తెలంగాణలో లా అండ్ ఆర్డర్ ఉందా? ఒక ఎమ్మెల్యేకే సెక్యూరిటీ లేకపోతే సామాన్యుల పరిస్థితేంటి? కచ్చితంగా దాడికి ప్రతిదాడి ఉంటుంది. రేపు వాళ్ల సంగతి తేలుస్తా అని అన్నారు. కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గాంధీ అనుచరులు కౌశిక్ ఇంట్లోకి దూసుకెళ్లారు. కౌశిక్ ఇంటిపై గాంధీ అనుచరులు రాళ్లు విసిరారు. ఈక్రమంలో ఇరు వర్గాలు కుర్చీలతో కొట్టుకున్నారు. ఒక దశలో ఇరు వర్గాలను పోలీసులు అదుపు చేయలేకపోయారు.

## దోషికి ఉరిశిక్ష విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు

సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): సంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికపై హత్యాచారం కేసులో దోషికి జిల్లా కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చింది. నిందితుడు చేసిన నేరం తీవ్రమైనదిగా పరిగణించి ఊరి శిక్షను ఖరారు చేసింది. కాగా, బీహార్‌కు చెందిన గఫార్ అలీ ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబుతుందనే కారణంగా కూల్ డ్రింక్‌లో మద్యం కలిపి తాగించి ఆమెను హత్యచేశాడు. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో గఫార్ అలీని దోషిగా నిర్ధారించింది. బాలికపై హత్యాచారం తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ సంగారెడ్డి కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది. ఇక, ఈ ఘటన జరిగిన 11 నెలలు అవుతోంది. తక్కువ సమయంలోనే దోషికి ఉరిశిక్ష పడటంతో బాలిక తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు.. సంగారెడ్డి జిల్లాలో 27 ఏళ్ల తర్వాత మరణ శిక్ష విధించారు.

## వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి : బంధువులు

### డాల్ఫిన్ హాస్పిటల్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

### ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలకు బంధువుల డిమాండ్



హనుమకొండ, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): హనుమకొండ లోని డాల్ఫిన్ చిల్డ్రన్స్ హాస్పిటల్లో చిన్నారి మృతి చెందడంపై పెద్ద దుమారమే చెలరేగింది. డాల్ఫిన్ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చిన్నారి జన్మ సాయి శ్రీ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన దిగారు. భూపాలపల్లి జిల్లా మొగులపల్లి మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన జన్ను సాయిని ఈనెల 9న హనుమకొండలోని డాల్ఫిన్ హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం అడ్మిట్ అయ్యారు. గత రెండు రోజులుగా వైద్యులు పాపకు ఎలాంటి ఇబ్బంది లేదంటూ రిపోర్టులు ఇస్తున్నారని తల్లిదండ్రులు తెలిపారు. పాపకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు బోరున్న విలపిస్తూ అన్నారు. గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో పాప ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు విస్తుపోయారు. కొద్దిసేపటికి పాప మరణించినట్లు డాల్ఫిన్ వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళన దిగారు. పాప చనిపోవడానికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని జన్మస్థాయి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు బైఠాయించి ఆందోళన దిగారు. ఆసుపత్రి పై కఠిన చర్యలు తీసుకోవాలని జన్ను సాయి శ్రీ కుటుంబ సభ్యులు బంధువులు ఆసుపత్రి వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అమాయకురాలైన చిన్నారి పాప ప్రాణాలు కోల్పోయిందని దానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి అంటూ తల్లిదండ్రులు అధికారులను కోరారు. డాల్ఫిన్ చిల్డ్రన్స్ ఆస్పత్రి గుర్తింపును రద్దు చేయాలని సాయి తల్లిదండ్రులు బంధువులు ప్రభుత్వాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కోరారు.

# పశ్చిమ బెంగాల్లో ప్రతిష్టంభన

మొదటి పేజీ తరువాయి



చేశారు. చర్చలకు మమతా బెనర్జీ హాజరవుతారని ప్రభుత్వం ప్రకటించింది. అయితే లైవ్ టెలికాస్ట్ డిమాండ్‌ను తిరస్కరించింది. ఈ నేపథ్యంలో డాక్టర్ల బృందం చర్చలకు హాజరుకాలేదు. కాగా, డాక్టర్లతో చర్చల కోసం ఎదురుచూసిన సీఎం మమతా బెనర్జీ అనంతరం మీడియాతో మాట్లాడారు. నిరసన చేస్తున్న వైద్యులను కలిసేందుకు తాను రెండు గంటల పాటు వేచి చూశానని తెలిపారు. అయితే వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని అన్నారు. సమావేశాన్ని రికార్డ్ చేసేందుకు పూర్తి వ్యవస్థ కలిగి ఉన్నట్లు తెలిపారు. పారదర్శకత కోసం రికార్డింగ్‌ను సుప్రీంకోర్టుకు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మరోవైపు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా పదవి నుంచి దిగిపోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని మమతా బెనర్జీ తెలిపారు. నాకు ముఖ్యమంత్రి పదవి వద్దు. తిలోత్తమకు న్యాయం జరుగాలని నేను కోరుకుంటున్నా. సామాన్య ప్రజలు వైద్యం పొందాలని కోరుకుంటున్నా అని అన్నారు. వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చారు. అలాగే చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని అన్నారు. కాగా, కొందరు స్వార్థ ప్రయోజనాలతో నిరసనకు సూత్రధారిగా ఉన్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులతో తమ ప్రభుత్వాన్ని అవమానిస్తున్నారని విమర్శించారు. దీని వెనుక రాజకీయ రంగు ఉందన్నది సామాన్యులకు తెలియదని అన్నారు. రాజకీయ రంగు పులుముకున్న వ్యక్తులకు న్యాయం అవసరం లేదని, వారికి కుర్చీ మాత్రమే కావాలని పరోక్షంగా బీజేపీపై మండిపడ్డారు.

## ఆర్టిఐ యాక్ట్ అంటే "ఎంఈఓ" కార్యాలయంలో లెక్కే లేదా..!

మొదటి పేజీ తరువాయి




నిబంధనల, చెక్ లిస్ట్ మేరకు గల సమాచారం కోసం రెడ్డి శేఖర్ అను దరఖాస్తుదారు సమాచారం కోసం దరఖాస్తు చేయగా పాక్షికంగా సమాచారం అందిచడమే కాకుండా అందులో కొంత సమాచారాన్ని మసక మసకగా, చదవడానికి, చూడడానికి వీలు లేకుండా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇదేంటని ఎంఈఓ పరకాల కార్యాలయం పీఐఓ, ఏపీఐఓ లను ప్రశ్నించగా యాజమాన్యం అదే ఇచ్చారు.. మేము మీకు ఇదే ఇచ్చాము అని నిర్లక్ష్య సమాధానం అదించారని రెడ్డి శేఖర్ తెలిపారు. సమాచార అధికారుల నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపించినా చేసేదేమి లేక మరొక దరఖాస్తు ద్వారా గత దరఖాస్తుకు ఇచ్చిన సమాచారంలో అసంపూర్తి, గుర్తించలేని విధంగా ఉన్న సమాచారం ఉండడంతో అట్టి అనుమతుల పత్రాల తనిఖీని కోరుతూ ఒక తేదీని తెలపవలసిందిగా కోరగా ఏ మాత్రం స్పందించకపోవడంతో.. నిర్నిత గడువు ముగుస్తున్న సమయంలో పీఐఓ, ఏపీఐఓ లను సంప్రదించి గుర్తు చేసినప్పటికి సమాచారాన్ని ఇప్పించలేకపోవడం, గతంలోని దరఖాస్తుకు కూడా (అసంపూర్తి, చదవడానికి వీలు లేని) సమాచారం ఇచ్చిన విధానం పలు అనుమానాలకు దారితీస్తున్నదని దరఖాస్తుదారు రెడ్డి శేఖర్ అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇచ్చిన సమాచారాన్ని తెలపకపోవడం వెనుక ఉన్న రహస్యం ఏంటి..?, చట్టబద్ధమైన బాధ్యతను సైతం విస్మరించడం, నిర్లక్ష్యం వెనుక దాగి ఉన్న కారణం ఏంటి..? పౌరుల హక్కును కాలరాసి.. ప్రయివేట్ యాజమాన్యానికి కాపు కాపుకస్తున్నారా.. లేక లంచాల ఉభిలో చిక్కుకున్నారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయంటూ రెడ్డి శేఖర్ వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. కాగా ఇట్టి కార్యాలయ పీఐఓ, ఏపీఐఓ లపై చట్టభద్దత గల హక్కు అమలుకు సంబంధించి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్య చర్యలపై తక్షణమే సంబంధిత జిల్లా ఉన్నత అధికారి విచారణ జరిపించి తగిన శాఖపరమైన చర్యలు తీసుకోవాలిసిందిగా దరఖాస్తుదారు రెడ్డి శేఖర్ డిమాండ్ చేశారు. అట్టి పాఠశాల విషయంలో అధికారులు దాస్తున్న రహస్యం ఏంటో.. నిబంధనలకు విరుద్ధమైన నిర్వహణ ఏంటో కూడా బహిర్గతం చేయాల్సిందిగా.. అట్టి వాటిపై తగిన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా విద్యా అధికారిని దరఖాస్తుదారు రెడ్డి శేఖర్ కోరారు.

## హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం రూ.261 కోట్లు చెల్లించాల్సి ఉందని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఎన్ ఎల్ డీసీకి ఫిర్యాదు చేసింది. దీంతో తెలంగాణ డిస్కమ్ లు విద్యుత్ కొనుగోలు బిడ్ లో పాల్గొనకుండా ఎన్ ఎల్ డీసీ అడ్డుకుంది. గురువారం ఉదయం నుంచి విద్యుత్ కొనుగోలుకు బిడ్లు వేయకుండా పవర్ ఎక్స్చేంజీలు నిలిపివేశాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం తెలంగాణ ప్రభుత్వానికి విద్యుత్ బిడ్డింగ్ కు అనుమతి ఇవ్వాలని ఎన్ఎల్ డీసీకి మధ్యంతర ఆదేశాలు ఉత్తర్వులు జారీ చేసింది.

## వైద్య, ఆరోగ్య శాఖలో 1,284 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ




మొదటి పేజీ తరువాయి

8 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ పరిధిలో 1,088, వైద్య విధాన పరిషత్ పరిధిలో 183 అదేవిధంగా ఎం అండ్ జే క్యాన్సర్ ఆసుపత్రి పరిధిలో 13 ఉద్యోగాలను పూర్తిగా చేయనున్నారు. కాగా ఈ పోస్టులకు గాను 18 నుంచి 46 ఏళ్లలోపు వారు అర్హులు. నవంబర్ 10న సీబీటీ విధానంలో పరీక్షను నిర్వహించనున్నట్లుగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీ సంబంధిత జీఓ బ్యాక్

మొదటి పేజీ తరువాయి

చేసిన జీవోను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఓడీలు, డిప్యుటేషన్లపై ఐదుగురు అధికారులతో కమిటీని నియమిస్తూ మార్గదర్శకాలను రూపొందించి జులై 24న ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తాజాగా ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణలో 20 వేల మంది ఉపాధ్యాయులు పదోన్నతులు, మరో 30 వేల మంది బదిలీలు పొందారు. మొత్తం టీచర్లలో సగం మంది ట్రాన్స్‌ఫర్ అయ్యారు. తీవ్ర అనారోగ్య సమస్యలున్న వారికి ప్రత్యేక పాయింట్లు ఇచ్చి వారు కోరుకున్న ప్రాంతానికి పంపించారు. అయినా కూడా పెద్ద సంఖ్యలో తమకు స్థానచలనం కలిగించాలని టీచర్లు కోరుతున్నారు. తమకు ట్రాన్స్‌ఫర్ కావాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులకు ఉపాధ్యాయులు ఇంకా వినతులు ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు వాటిని విద్యా శాఖకు పంపిస్తున్నారు. అందుకే విధానపరమైన నిర్ణయం తీసుకుంటున్నామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జులైలో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఏదో ఒక కారణం చెప్పి బదిలీలకు అవకాశమిస్తే చదువు చెప్పేదెవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో టీచర్లే ఉండరని ప్రభుత్వం సీరియస్ అయినట్లు తెలిసింది. అందుకే జులైలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేస్తున్నట్లు వెంకటేశం ఆగస్టు 31న ఉత్తర్వులు ఇచ్చారు. అవి 10 రోజుల తర్వాత బయటకు వచ్చాయి. తాము ప్రత్యేకంగా సూచించే వరకు ఆయా విభాగాలు ప్రతిపాదనలు పంపొద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి





రుణాలు అందించడంతో పాటు మహిళలు 17 రకాల వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తున్నదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ లతో కలిసి ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలోని ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ఎస్ హెచ్ జి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ మహాలక్ష్మి మిల్క్ పార్లర్, కోమలి డిజిటల్ స్టూడియో బుక్ స్టాల్ జిరాక్స్ ఇంటర్నెట్ సెట్ సెంటర్, సునిత ఎంబ్రాయిడరీ వర్క్స్, సారీ సెంటర్, శ్రీ వెంకటేశ్వర కిరాణం జనరల్ స్టోర్ లను ప్రారంభించడంతో పాటు రాంసింగ్ తండాలో ఒక కోటి 10 లక్షల, శివ తండాలో ఒక కోటి 20 లక్షలతొ నిర్మించిన బిటి రోడ్లు, జాకారం గ్రామంలో 28.25 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన డైరీ ఫామ్ నుప్రారంభించారు. అనంతరం జాకరం గ్రామం లో 28.25 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం భవనాన్ని , ములుగు కేంద్రంలో 6 కొట్ల అంచనతో ములుగు – బుద్దారం రహదారిలో కి.మీ. 0/0 నుండి 1/0 (ములుగు పట్టణములో) వరకు 4 వం–సల రహదారి నిర్మాణ పనులను ములుగు మండలం పులిగుండం గ్రామంలో పులిగుండం నుండి చింతకుంట వరకు 70 లక్షలతో నిర్మించిన బిటి రోడ్డును జంగాలపల్లి – అంకన్న గూడెం రహదారి వెడల్పు చేయుట పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి క్యాంట్లను మహిళా సంఘాల వారు ఏర్పాటు చేయడం కోసం రుణాలు మంజూరు చేసి ప్రారంభించడం జరిగిందని, జిల్లాలో 20 ఎకరాల స్థలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి మహిళలు ఒక అప్పగించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను తీసుకుంటున్న మహిళలు సకాలంలో అప్పు చెల్లించాలని,

తిరిగి పెద్ద మొత్తంలో అప్పు కోరిన మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పలు రకాల వ్యాపారాలు చేసుకోవడానికి మహిళలకు డి ఆర్ డి ఏ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సూచనలు సలహాలు ఇవ్వాలని, మహిళలు బాగుంటేనే గ్రామాలు సమాజం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా ములుగు జిల్లాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి అన్ని పార్టీల నాయకులు ముందుకు రావాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ముందుకు సాగుతున్నారని అన్నారు. ములుగు జిల్లాలో చాలా వేగంగా అభివృద్ధి చెందుతుందని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ కూడా తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. నూతనంగా చేపట్టిన పనులను నాణ్యత పూర్తి చేయాలని, నాసిరకంగా పనులు చేస్తే సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే గిరిజన యూనివర్సిటీ తరగతుల ప్రారంభం, మెడికల్ కళాశాల తరగతుల ప్రారంభం జరిగిందని, రానున్న రోజుల్లో నర్సింగ్ కళాశాల సైతం ఏర్పాటు కాబోతుందని అన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పను 100 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని, రామప్ప సరస్సు మధ్యలో ఐలాండ్ ఏర్పాటు చేసి పర్యాటకులు ఆకట్టుకునే విధంగా పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, ఆర్డీఓ సత్య పాల్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్ అండ్ బి, పంచాయితి రాజ్ ఈఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## వైద్యుల సమ్మెకు పరిష్కారమెప్పుడు

కోల్‌కతా ఘటనలో జూనియర్ వైద్యుల కోణం లోనూ, ప్రజల కోణంలోనూ చూస్తే, తమ తోటి స్టాఫ్ అయినా ఒక వైద్యురాలు అత్యంత వేదనాభరితంగా, నిస్సహాయ స్థితిలో లైంగిక దాడికి గురై ప్రాణాలను కోల్పోయింది. ఇది వైద్యులూ, ప్రజలూ జీర్ణం చేసుకోలేకపోతున్నారు. పోలీసుల నుండి, ప్రభుత్వం నుండి మానవత్వంతో కూడిన స్పందన రావాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా కొన్ని ప్రయత్నాలు జరగడం జూనియర్ వైద్యులకూ, తీవ్రమైన దిగ్భ్రాంతిని కలిగించాయి. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాల్సింది. కానీ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయకుండా మరో మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. దాంతో పాటు, బాధితురాలు ఆత్మహత్య చేసుకుందని ఆత్మహత్య కథనాలు అల్లి శవ దహనం కూడా వీలైనంత వేగం చేయించేసి డబ్బు ఆశ కూడా చూపించే ప్రయత్నాలు జరిపించడం పట్ల జూనియర్ వైద్యులకు విపరీతమైన కోపం ఉంది. అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన చట్టం చేసినంత మాత్రాన ఇవి పరిష్కారం కావు. తమ డిమాండ్లు నెరవేరే వరకు, బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ' "కోల్‌కతా పోలీస్ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య సేవల విభాగం డైరెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లను తొలగించాలి" అని వారు డిమాండ్ చేశారు.మహిళలను గౌరవించే సామాజిక, సాంస్కృతిక విప్లవం నిరంతరం జరగాలి.ప్రభుత్వం కోణంలో చూస్తే, వైద్యులు హాస్పిటల్‌కి చాలా అవసరం. పేదలే ప్రభుత్వాసుపత్రులకు వస్తారు. డబ్బున్న వారూ, మధ్యతరగతీ సాధారణంగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తారు. జూనియర్ వైద్యుల సమ్మె హాస్పిటల్ సేవలో సమస్యలను తెచ్చి పెట్టింది. రోగులు సరైన ట్రీట్మెంట్ లేక నిస్సహాయ స్థితిలో పడిపోవడం కూడా జరుగుతుంది. ఓపిడీలలో సరైన ట్రీట్మెంట్ దొరకడం లేదు. ఈ కారణాలన్నీ చూపిస్తూ, ప్రభుత్వం జూనియర్ వైద్యుల్నీ, మెడికల్ ట్రైనీలనూ వెంటనే తమ పనుల్లో చేరమని అభ్యర్థిస్తోంది. ఇక ప్రభుత్వం తరపున వాదన ఏమిటంటే, పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. సీబీఐ తన పని తాను చేసుకుంటోంది. కోర్టుల ఆధ్వర్యంలో కేసు నడుస్తోంది. మహిళల మీద అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం శాశ్వత పరిష్కారాల కోసం అపరాజిత చట్టాన్ని కూడా వీలైనంత తక్కువ సమయంలో తీసుకొచ్చింది. మహిళల సెక్యూరిటీ కోసం పాలనా పరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంది. మహిళా పోలీసుల్ని రాత్రి వేళల్లో నియమించబోతోంది.దాదాపు 7,000 మంది మూక ఆగస్టు 14 రాత్రి హాస్పిటల్ మీద పడి జూనియర్ వైద్యులను భయభ్రాంతులకు గురి చేశారు. ఇదంతా కూడా పాలనా యంత్రాంగం ఆశీర్వాదం లేకుండా జరుగుతుందా ? అన్న ప్రశ్న జూనియర్ వైద్యులకు మాత్రమే కాదు, ప్రజలకు కూడా వస్తోంది. అందుకే, జూనియర్ వైద్యులు సంబంధిత ప్రిన్సిపల్‌ని సస్పెండ్ చేయమని కోరుతున్నారు. అలానే, పూర్తిగా వైఫల్యం చెందిన పోలీస్ కమిషనర్‌ను కూడా తొలగించమని కోరుతున్నారు. దాంతో పాటు బాధితురాలికి జరిగిన అన్యాయం పట్ల సరైన న్యాయబద్ధమైన పరిష్కారం కోరుతున్నారు. ప్రభుత్వం నుండి సంతృప్తికరమైన సమాధానం రానంతవరకు సమ్మె ఆగేది లేదని జూనియర్ వైద్యులు చెబుతున్నారు. ఈ రెండు ఇలా ఉంటే, దగ్గర్లో దుర్గా పూజా కారణంగా అతిపెద్ద మార్కెట్ మిస్ చేసుకుంటున్న వ్యాపార వర్గాలు అత్యంత ఆందోళనలో ఉన్నాయి. దుర్గా పూజ ఒక పూజ మాత్రమే కాదు. కొన్ని వేల కోట్ల రూపాయల వ్యాపారం. ఈ వర్గం కూడా అత్యంత ఆవేదనలో ఉంది. ఈ వ్యాపారం మీద ఎన్నో వేలమంది ఉపాధి కోసం ఆధారపడి ఉన్నారు. అందుకే ఈ వర్గం కూడా కోపంతో ఉంది.సుదీర్ఘ కాలంలో ఏ ప్రభుత్వం ఉన్నా సరే, ఏ పార్టీ ఉన్నా సరే అనైతిక శక్తులు, అవినీతికర శక్తులు ఆ పార్టీలో ప్రవేశించడం, ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించడం మనకు తెలిసిందే. నేడు బెంగాల్‌లో కూడా అదే కనిపిస్తుంది. ఉపాధ్యాయుల నియామకం విషయంలో విపరీతమైన అవినీతి ఇంతకుముందు చూశాం. అప్పుడైనా సరే, పాలకవర్గం జాగ్రత్త పడాల్సింది. దాంతో పాటు హాస్పిటల్లలోనూ, రోడ్లమీద పర్మనెంటు పోలీసుల నిర్వహణ తగ్గి, కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డ్స్ నియామకం పెరిగింది. సివిక్ వాలంటీర్ల నియామకం పెరిగింది. వీరి జీతాలు చాలా తక్కువ. ఒక పెద్ద మెడికల్ కాలేజ్ పర్మనెంట్ పోలీసుల నిర్వహణలో ఉండడం వేరు. చూసీ చూడని కాంట్రాక్టు గార్డుల నియామకంలో, నిర్వహణలో ఉండడం వేరు. మన పాలకవర్గాలు చాలా రాష్ట్రాల్లో ప్రజలకు ఉచితాలను అలవాటు చేసి ప్రజల్లో ప్రశ్నించే స్వభావం, నిరసించే గుణం తగ్గించేశారు. ఇలాంటి ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలు ప్రపంచ బ్యాంకు సలహాలతో ముందుకు నడుస్తాయి. కాబట్టి, మనం వుయ్ వాంట్ జస్టిస్ అన్నప్పుడు ఒకవైపు బాధితురాలికి సరైన న్యాయం అందాలి. మరోవైపు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి హాస్పిటల్‌లోనూ సెక్యూరిటీలో కాంట్రాక్టు ఉద్యోగులను పూర్తిగా తగ్గించి పర్మనెంట్ పోలీసుల చేతుల్లోకి వెళ్లాలి. అందుకోసం, పోలీసుల నియామకాలు యుద్ధ ప్రాతిపదికన జరగాలి.మహిళల మీద అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన చట్టం చేసినంత మాత్రాన ఇవి పరిష్కారం కావు. ప్రజా వ్యతిరేక విధానాలను తొలగించి, ప్రజానుకూల విధానాలు రావాలి. అలానే, ప్రజల్లో సామాజిక, సాంస్కృతిక చైతన్యం పెరగాలి. మహిళల పట్ల చులకన భావం, మహిళలని అవమానించే భాష వాడకం తగ్గాలి. అవతలి మహిళను గౌరవించే సంస్కృతి పెరగాలి. అందుకు నిరంతరంగా సాంస్కృతిక రంగంలో మార్పు జరగాలి. అలానే, మన సినిమాల్లో హీరోల ప్రవర్తన హీరోయిన్ పట్ల అత్యంత చులకన భావంతో ఉంటుంది. వాడే భాష కూడా అలాగే ఉంటుంది. దాన్నే బాగా ప్యాక్ చేసి ఒప్పించే తప్పుడు విలువలు అత్యంత ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇలాంటి సినిమాలు చూడకుండా నిరసన తెలియజేయడం కూడా రావాలి. ఇలా సామాజిక, సాంస్కృతిక విప్లవం నిరంతరం జరగాలి. అప్పుడే వుయ్ వాంట్ జస్టిస్ ఉద్యమానికి న్యాయం జరుగుతుంది.

## మేజర్ గ్రామ పంచాయతీలో కుక్కలు, కోతుల బెడద

- ప్రజల సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలం
- ఎంపీఓని నిలదీసిన రాపోలు నవీన్ కుమార్
- సమస్యను పరిష్కరించాలని ఎంపివోకు వినతి




నేరేడుచర్ల, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో కుక్కలు,కోతుల బెడదతో ప్రజలు అల్లడిపోతున్నా గ్రామ పంచాయతీ తరుపున ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అత్యవసరంగా చర్యలు చేపట్టాలని, లేని యెడల కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపడుతామని బీఆరెస్ నాయకులు రాపోలు నవీన్ కుమార్ గ్రామస్తులతో కలిసి ఎంపివో కి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా హుజుర్నగర్ నియోజకవర్గ బీఆరెస్ నాయకులు నవీన్ కుమార్ మాట్లాడుతూ దిర్శించర్ల మేజర్ గ్రామ పంచాయతీలో కోతులు, కుక్కలు, సంచారం అధికంగా ఉందని దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు అని కోతులు, కుక్కలు పట్టుకొని అడవుల్లో వదిలివేస్తున్నామని పంచాయతీ అధికారులు చెప్తున్నమాటలు నీటి మూటలయ్యాయి అని అన్నారు. ప్రతిరోజు కుక్కలు, కోతుల దాడులతో ప్రజలు భయపడుతున్నారని కోతులు, కుక్కలు గుంపులుగా తిరుగుతు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తు ఇళ్లల్లో దూరి అదిలించిన వారిపై దాడిచేస్తున్నాయని కుక్కలు కోతులు గ్రామపంచాయతీ కార్యాలయంలోనే యథేచ్ఛగా సంచరిస్తు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రజలు చెపుతున్న అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం అని అన్నారు. అధికారులు ఇప్పటికైనా కోతుల, కుక్కల బెడద తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుర్రి.శ్రీను, బుర్రి.నర్సింహా, మాతంగి వెంకటయ్య, నక్క శంభిరెడ్డి, కె.రాంబాబు, పి.వినోద్, కె.రమేష్, మల్లమ్మ, ఉష, లింగమ్మ, మరియు జీలకర రామస్వామి, కర్రీ సతీష్ రెడ్డి, షేక్ ఇంతియాజ్, నాగార్జున స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న

- ♦ పరమేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదానం
- ♦ అన్నదానం వల్ల ఎంతో పుణ్యం



దేవరకద్ర, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రజల పై గణనాధుని ఆశీర్వాదం ఉండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వడ్డేమాన్ పద్మజ వెంకటయ్య అన్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం తీర్మాలయాపల్లి గ్రామంలో పరమేశ్వర యూత్ గణేశ్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ యూత్ నిర్వాహకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమం చేపట్టారు. అన్నదానం చేయడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని అన్నారు. గణనాథుని ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో భోగభాగ్యాలతో వర్ధిల్లాలని వినాయకుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర యూత్ రామకృష్ణ అంజి రాజేష్ రవి అభిషేక్ శివ నరేంద్ర సంపత్ భరత్ నరేష్ శ్రీకాత్ రాకేష్ మోహన్ శెంకర్ అక్షయ్ గోవర్ధన్ మహేష్ ఐశ్వర్యం శ్రీకాంత్ మరియు స్థానిక కాలనీ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## జోరుగా కొనసాగుతున్న బిజెపి సభ్యత్వ నమోదు

- లక్ష్యానికి మించి బిజెపి సభ్యత్వ నమోదు చేయాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి



అమరచింత ), సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని నందిమల్ల, ప్రియదర్శిని ఎక్స్ రోడ్ చంద్రఘాట్, ధర్మపూర్ పలు గ్రామాలలో జోరుగా భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ కార్యక్రమం కొనసాగుతుంది ఇట్టి కార్యక్రమానికి నారాయణపేట జిల్లా కన్వీనర్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థగత పర్వం సభ్యత్వ నమోదు కార్యక్రమం 2024 కార్యక్రమంలో లక్ష్యానికి మించి బిజెపి సభ్యత్వ నమోదు చేస్తామని అన్నారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి బిజెపి సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు సభ్యత్వ నమోదు జిల్లాకు కన్వీనర్ అశోక్ కుమార్ మండల కన్వీనర్ చిన్న మల్లేష్ మండల కన్వీనర్లు కుర్మారెడ్డి భరత్ నవీన్ వెంకటయ్య హెచ్ రవికుమార్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన పట్ల హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- • హర్షం వ్యక్తం చేసిన బీసీ నేత ధనుంజయ నాయుడు



పాలకవీడు, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): బీసీ కుల గణన పట్ల ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు. గురువారం నాడు ఆయన పాలకవీడు మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి యువజన విభాగం నాయకుడు యల్ల బోయిన సింహాద్రి,చిలకరాజు శ్రీనుతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ మూడు నెలల్లో బీసీ కులగణన పూర్తి చేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించడం ఎంతో సంతోషకరమైన విషయమని హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, సమగ్ర కుల గణన లెక్కలను నోటిఫై చేసి దానిని ప్రాతిపదకగా తీసుకొని అధికారికంగా ప్రకటించాలని, దానికి అనుగుణంగా 42శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్లాలని, లేదంటే రాష్ట్ర ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురికావలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలోని అనేక బీసీ సంఘాలు 2019వ సంవత్సరం నుంచి కోర్టులో అనేక రకాలుగా పిల్ వేసినప్పటికి, గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో, కేసు ఆగిపోయిందని 2019లో నాటి కెసిఆర్ ప్రభుత్వంకౌంటరు దాఖలు చేయకుండా నాలుగున్నర సంవత్సరాలు సాంకేతిక కారణాలతో కేసును తొక్కి పట్టిందని,దీనికి తోడు ఇదే పిటిషన్ లో బిఆర్ఎస్ కు చెందిన కొంతమంది ముఖ్యులతో ఇంప్లేడు చేయించి కేసులు కదలకుండా చేశారని అయినప్పటికీ చివరకుధర్మమే జయించిందని హైకోర్టు ఇటీవల వచ్చిన తీర్పు వల్ల బీసీలకు నైతిక బలం చేకూరిందని ఆయన సంతోషం వెలిబుచ్చారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తే తెలంగాణ వ్యాపితంగా మూడు వేల మంది బీసీలు సర్పంచులు అయ్యే అవకాశం వస్తుందని ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో అంగీకరించి కనీసం బీసీలకు సర్పంచ్ అయ్యే అవకాశమైనా కల్పించాలని రాజకీయంగా గత 78 సంవత్సరాలగా బీసీలకు పాలకులు అన్యాయం చేస్తూనే ఉన్నారని కనీసం రేవంత్ రెడ్డి ప్రభుత్వ మైనా బీసీలకు అండగా ఉండాలని హైకోర్టు తీర్పును గౌరవించి మసలుకోవాలని ఆయన ఉద్బోధించారు

## విష జ్వరాలు ప్రబలకుండా ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

జగిత్యాల: విష జ్వరాలు ప్రబలకుండా ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు. రోజున జగిత్యాల మండలం తిప్పన్న పేట గ్రామంలో హెల్త్ క్యాంప్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారని,డెంగ్యూ పరీక్షలు చేస్తున్నారని ఇప్పటి వరకు డెంగ్యూ జ్వరం బారిన ఎవరు పడలేదని, వైరల్ ఫీవర్స్ వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా లేదని కలెక్టర్ రిజిస్టర్ ను చెక్ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో కానీ, నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో, వాటర్ బాటిల్స్, టైర్స్ వంటి వాటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, అలాగే ఇంటి చుట్టూ పక్కల పరిసరాలలో నీరు నిల్వ ఉన్న స్థలంలో దోమలు ఉండే అవకాశం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రతపై అధికారుల బృందాలు అవగాహన కల్పిస్తున్నాయని ప్రజలు సహకరించాలని కోరారు.

## ఉరివేసుకొని వ్యక్తి బలవన్మరణం



జవహర్ నగర్ సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి బాలాజీనగర్లో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సాయిబాబా దేవాలయం వ్యవస్థపకుడైన నన్నపూరి కృష్ణ కుమారుడైన నన్నపురి భానుప్రకాశ్ (35) భార్య, కుమారుడితో కలిసి నివాసముంటున్నాడు. గత కొంత కాలంగా భానుప్రకాశ్ అనారోగ్యంతో బాధపడుతూ మానసిక క్షోభ గురైయ్యాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో సీలింగ్ఫ్యాన్కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానికంగా ప్రైవేట్ హాస్పిటల్కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఫోటో గ్రాఫర్గా పని చేస్తున్న భానుప్రకాశ్ ఆత్మహత్య చేసుకోవడంతో బాలాజీనగర్ లో విషాదాఛాయలు నెలకొన్నాయి. పలువురు నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం హిందూస్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## రూ.10లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం



- ♦ జవహర్నగర్ మేయర్ శాంతి

జవహర్ నగర్, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మేయర్ శాంతి అన్నారు. జవహర్ నగర్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీనగర్ లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రగతికి కట్టుబడి ఉన్నామని, ప్రతి డివిజన్లో భూగర్భడ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేష్ గౌడ్, వినోద్, రాజుగౌడ్, అరుణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోది స్కీముల గురించి అవగాహన



వనపర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): పోచగుడ్డ దగ్గర డిగ్రీ కాలేజీ ఆవరణలో వనపర్తి డిస్ట్రిక్ట్, ప్రతి ఒక్కరికి నరేంద్ర మోదీ స్కీమ్ ల గురించిరాబోయే కాలంలో మన నవ యువత ముందంజలో ఉంటుంది కాబట్టి మనమందరం సభ్యత్వం స్వీకరించి మిస్సేడ్ కాల్ ఇచ్చే నెంబర్ 8800002024 ప్రతి ఒక్కరు దీనికి సహకరించి భారతదేశంలో సభ్యత నమోదు కార్యక్రమంలో బిజెపి పార్టీ ముందు ఉండాలని కోరుకుంటున్నాం. బిజెపి సభ్యత్వ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చెయ్య లని, జిల్లాలో 40 వేల సభ్యత్వాన్ని నిర్దేశించిందని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతి ఒక్కరు సమిష్టి కృషి చేయాలని అన్నారు. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కో ఇంచార్జి పద్మావతి, మాజీ అధ్యక్షురాలు వారణాసి కల్పన, మాజీ కౌన్సిలర్ సుమిత్రమా, జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, జిల్లా అధికార ప్రతినిధి సరోజ, అశ్విని రాధ జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు, తదితరులు పాల్గొన్నారు.

## పెంటయ్య యాదవ్ ని పరామర్శించిన డా. ఆదిత్య రెడ్డి



వనపర్తి నియోజకవర్గం, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): హైదరాబాదులో హస్తినాపురం, పైనారి హాస్పిటల్లో, చికిత్స పొందుతున్న పెద్దమందడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సి.పెంటన్న యాదవ్ ని పరామర్శించిన ఏఐపిసి స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి హైదరాబాదులో హస్తినాపురం పైనరీ హాస్పిటల్ చికిత్స పొందుతున్న పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి.పెంటన్న యాదవ్ అనంతరం డాక్టర్ల ద్వారా సి.పెంటన్న యాదవ్ ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతిచెందిన కంప్యూటర్ ఆపరేటర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): మహా ముత్తారం మండలంలో కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్న పుట్టల రమేష్ ఆకస్మిక మరణంతో అతని కుటుంబానికి రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ ఉద్యోగులు 166301 నుండి రూ.150000 మొత్తమును పుట్టల రమేష్ కూతురు పుట్టల రాగిణి పేరున సుకన్య సమృద్ధి యోజన పథకం కింద పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగింది. ఇట్టి మొత్తము పాపకు 21 సంవత్సరాలు నిండిన తరువాత పాప మాత్రమే మొత్తము పొందే విధంగా ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగింది. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గ ఫిక్స్ డిపాజిట్ చేసిన బాండు, మిగిలిన మొత్తం రు.16301 నగదును రమేష్ సతీమణి పుట్టల రజిత కు అందించడం జరిగింది. ఈ సందర్భంగా పుట్టల రజిత కలెక్టర్ ని తన భర్త చనిపోయినందున, తాను డిగ్రీ చదివి ఉన్నానని, తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మహా ముత్తారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం ఎపిఓ ఎం. కుమారస్వామి, ఉపాధి హామీ ఉద్యోగులు ఇంజనీరింగ్ కన్సల్ టెంట్స్ నాగేందర్, మంగీలాల్, ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, షఫియోద్దీన్, రాజేందర్, శ్రీనివాస్, రాజకుమార్, సీసీ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా వినాయక నిమజ్జన ఏర్పాట్లు

## ♦ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం లోని రాజరాజేశ్వర వసతి గృహం లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కిరణ్ కరేతో కలసి రెవెన్యూ, పోలీస్ పంచాయితీ, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, విద్యుత్, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, మత్స్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి, కమిటీ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో కాళేశ్వరం వద్ద గోదావరిలో వినాయక నిమజ్జనానికి భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల నుండి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు యంత్రాంగం సూచనలు పాటించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాలు పర్యవేక్షణకు అధికారులకు విధులు కేటాయించామని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జనం చేయడానికి రెండు పాయింట్లు అలాగే రెండు క్రేన్ లు ఏర్పాటు చేయడం జరిగిందని క్రేన్స్ ద్వారానే విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే భక్తులు జిల్లా యంత్రాగం నిర్దేశించిన ప్రదేశం వరకే అనుమతి ఉంటుందని భక్తులు సహకరించాలని సూచించారు. నిరంతర పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు.పంచాయితీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా భక్తులకు త్రాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఏదేని సమస్య వచ్చినా విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నయ ఏర్పాట్లుతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మేఘా సంస్థ ద్వారా రెండు జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గజ ఈత గాళ్ళు లైఫ్ జాకెట్లు ధరించి సిద్ధంగా ఉండాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రహదారులపై గుంతలు ఎర్పడ్డాయని మరమ్మతు లు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగ కుండా ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని తెలిపారు. మరుగుదొడ్లు గుర్తించే విధంగా సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఏదేని సమస్య వస్తే అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. 9 రోజుల పాటు నైవేద్యాలు అందుకున్న వినాయకుడు గంగమ్మ వడికి చేరుతున్నాడని ఎలాంటి అపశ్రుతులకు అవకాశం లేకుండా భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని భక్తులు యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఏర్పాట్లు పర్యవేక్షణ కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజులు మద్యం విక్రయాలు నిలిపివేయాలని సూచించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడు తూ పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శోభా యాత్ర కొనసాగే మార్గాలలో పటిష్ఠ మైన నిఘా ఉంటుందని ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. భూపాలపల్లి, కాటారం, మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని, 24 గంటలు పనిచేయు విధంగా అత్యవసర చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పురుగు మందుల షాపులో మండల వ్యవసాయ అధికారి తనిఖీ

## తనిఖీలో భాగంగా నమూనాల సేకరణ

## మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్



కన్నాయి గూడెం, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గురువారం ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలం, ముప్పనపల్లి లోని హారిక ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాప్ ను మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ తనిఖీ చేశారు. తనిఖీలో భాగముగా నాణ్యత ప్రమణాల నిర్ధరన కొరకు రెండు పురుగు మందుల నమూనా సేకరించి పరీక్ష కేంద్రానికి పంపించారు, అంతేకాకుండా పురుగు మందుల స్టాక్ రిజిస్టర్ మరియు బిల్లు బుక్ లను ను ధృవీకరించారు, మరియు రైతులు పురుగు మందుల బిల్లు తప్పక అడిగి తెలుసుకొని దాచుకోవాలని తెలిపారు, అంతేకాకుండా రైతు లు మిరప నార్ల పై సిఫారసు మోతాదు కంటే ఎక్కువ పురుగు మరియు తెగుళ్ల మందులు వాడటం గమనిచమని తెలిపారు. దాని ద్వారా ఆకులు నల్ల బడటం, రాలి పోవటం జరుగుతుంది, కాబట్టి మోతాదు కు మించి పిచికారి చెయ్యద్దు అని తెలిపినారు.

# జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయండి

## డి.రవీంద్రశర్మ జిల్లా ప్రధానన్యాయమూర్తి



మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఈనెల 28వ తారీఖున మహబూబాబాద్ జిల్లా కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని జిల్లా జడ్జి డి.రవీంద్రశర్మ పిలుపునిచ్చారు. ఈరోజు జిల్లా కోర్టు ఆవరణలో జిల్లాలోని ఉన్నత పోలీసు అధికారులతో జరిగిన 28న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్ మీటింగ్లో జడ్జి మాట్లాడుతూ, జిల్లా కోర్టులో పరిధిలో అన్ని కోర్టులలో కొన్ని వేల కేసులు పెండింగులో ఉన్నాయని, ఈ కేసులన్నింటినీ రెగ్యులర్ కోర్టుల్లో పరిష్కారం పరిష్కారం చేయాలంటే చాలా సంవత్సరాలు పడుతుందని చెప్పారు. అందుకని కేసులను రాజీ చేసుకునేందుకు ఇదే మంచి అవకాశమని అదేవిధంగా లోక్ అదాలత్ లో రాజీ చేయదగిన అన్ని కేసులను రాజీ చేస్తారని, ఈవిదంగా రాజీ రాజీ చేసుకోవడమంటే ఇరుపక్షాలు గెలిచినట్లే లెక్క అని, అప్పుడు ఇరుపక్షాలకు కక్షలు కార్పన్యాలు తగ్గి ఇరువురు స్నేహభావంతో మెలగడానికి అవకాశం ఏర్పడుతుందని, అదేవిధంగా ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమను తగ్గించుకున్న వారు అవుతారని ఈ సందర్భంగా జడ్జి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ మరియు సెక్రటరీ అయిన సురేష్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ మహబూబాబాద్ తిరుపతిరావు జిల్లా కోర్ట్ పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, అదే విధంగా అన్ని పోలీస్ స్టేషన్ల నుండి సర్కిల్ ఇన్స్పెక్టర్లు, మరియు సబ్ ఇన్స్పెక్టర్లు హాజరై లోక్ అదాలత్ లో పెద్దమొత్తంలో కేసులను రాజీచేసే ప్రయత్నం చేస్తామని అదనపు ఎస్పీ హామీ ఇస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# వర్షాల కారణంగా మృతి చెందిన కుటుంబాలకు 5 లక్షల చెక్కుల పంపిణీ

## – రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



తాడ్వాయి, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): గురువారం గత కొద్దిరోజుల క్రితం భారీ వర్షాల వర్షాల కారణంగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంలో పిడుగుపాటు వలన ప్రమాదవశాత్తు మరణించిన పుట్ట మహేష్, తల్లి పుట్ట స్వరూప కు 5 లక్షల రూపాయల చెక్కును, కాల్వపల్లి గ్రామంలో వరదలో చిక్కుకొని ప్రమాదవశాత్తు మరణించిన జెర్రీ పోతుల మల్లికార్జున్ భార్య భారతి కి 5 లక్షల రూపాయల చెక్కును, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరామ్ నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో తహశీలదార్ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి







## ■ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాలు

పరకాల, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. గురువారం పరకాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్ లు, మండల పరిషత్ అధికారులతో పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన, జరగవలసిన అభివృద్ధి పనులపై ఆయా శాఖల వారీగా వివిధ అంశాలతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమన్వయంతో కృషి చేయాలి అన్నారు. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాగు త్రాగునీరు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకాలకు ప్రతి కుటుంబానికి సబ్సిడీపై గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికందేలా కృషి చేయాలన్నారు. విధుల పట్ల అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని అన్నారు. గ్రామాలలో శానిటేషన్, త్రాగునీరు, స్ట్రీట్ లైట్స్ అంశాలపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు సమయపాలన పాటించాలని, గ్రామాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా సత్వర చర్యలు చేపట్టాలన్నారు.

# పోషణ మాసం కార్యక్రమం





ఆత్మకూరు, సెప్టెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలముల గ్రామంలో స్థానిక అంగన్వాడి కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు బాలింతలకు కిశోర తల్లులకు పోషక ఆహార గురించి చిరుధాన్యాలు ఆకుకూరలు పండ్లు మాంసకృతుల గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత వాటి ప్రాముఖ్యత గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, సంధ్యారాణి, లక్ష్మీదేవమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయానికి ప్రతీక తీజ్

## – అనాదిగా వస్తున్న సంప్రదాయాని కాపాడుతున్న బంజారా బిడ్డలు

## – పాశ్చాత్య సాంప్రదాయాన్ని లెక్కచేయని అడవి బిడ్డలు

## – గిరిజన తండాల్లో అతిపెద్ద పండుగ తీజ్



రామారెడ్డి: ప్రపంచవ్యాప్తంగా వెల్లివిరుస్తున్న పాశ్చాత్య సాంప్రదాయాన్ని లెక్కచేయకుండా, అనాదికాలంగా వస్తున్న సాంప్రదాయాన్ని బతికించుకోవడం తెలంగాణ ప్రత్యేకత. తెలంగాణలో బోనాలు, నాగోబా జాతర, సమా జంలో బతుకులు నేర్పే ప్రకృతి పండుగ బతుక మ్మ లాంటి ఉత్సవాలను ప్రతి సంవత్సరం ప్రజలు జరుపుకుంటున్నారు. గిరిజన తాండాల్లో ఉండే బంజారాలు ఆచారాలు, వేషధారణ, సంస్కృతి సంప్రదాయాలను బతికించుకుంటూ ప్రతి సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ మాసం వరకు, ప్రతి బుధవారం మొదలుకొని మరుసటి గురువారం వరకు 9రోజులు గిరిజనులు అతి పెద్ద పండుగగా తీజ్ నిర్వహిస్తారు. పూర్వం గిరిజన తండాల్లో వ్యాధులు, కలరా వచ్చి వందల సంఖ్యలో ప్రజలు చనిపోతుంటే తాండా పెద్దలు సమావేశమై.. సేవాలాల్ మహారాజ్, దండీమేర మాయ డిలను, జగదాంబ మాతకు పూజించిన నుంచి తండాలు సుఖసంతోషాలతో ఉంటున్నారని, యువతీ యువకులకు మంచి పెండ్లి సంబంధాలు వచ్చాయని వారి నమ్మకం. అప్పటి నుంచి వస్తున్న ఈ సాంప్రదాయక పండుగనే తీజ్. పెండ్లి కాని గిరిజన ఆడబిడ్డలు నియమనిష్టలతో, ఉపవాస దీక్షలతో ఈ పండగను ప్రారంభిస్తారు. ప్రారంభానికి ఒక రోజు ముందు రాత్రి గోధుమలను, శనిగలు నానబెట్టి, మరుసటి రోజు ఉదయాన్నే చీమలు తీసిన మట్టితో పాటు ఎండిన ఆవుపేడను కలిపి వెదురుతో అల్లిన ఓ కొత్త బుట్టలో వేసి, గోధుమలను బుట్టలో చల్లి, తండాలోని పెద్దమ నిషి ఇంటివద్ద మంచె ఏర్పాటు చేసి దానిపై ఉంచుతారు. సాయంత్రం అక్కడే రేణి కొమ్మను నాటి, వాటి ముళ్లకు శనగలను తొడిగి గిరిజన సాంప్రదాయక ఆట "బోరెడీ తీజ్"ను నిర్వహిస్తారు. ఉపవాస దీక్ష చేపట్టిన యువతులు తొమ్మిది రోజులు పచ్చ కూరతో పాటు, మక్క గట్కను ఒక్కపూట మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. రెండవ రోజు నుంచి ఎనిమిదో రోజు వరకు గోధుమలకు రోజు మూడు సార్లు వాగులు, బావులు, బోరు బావుల నుంచి తీసుకువచ్చిన నీటిని కొత్త బుట్టలో నాటిన గోధుమలకు యువతులు అందిస్తారు. ఎనిమిదవ రోజు రాత్రి "గానుగోతు" తీజ్ నిర్వహిస్తారు. గౌరీ, గౌర విగ్రహాలను మట్టితో ప్రతిష్టించి భోగ్ బండారు వేస్తూ గిరిజనులంతా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నాటిన గోధుమలు పచ్చగా ఎంత ఏపుగా పెరిగితే అంత శుభమని నమ్ముతారు. తొమ్మిదవ రోజు ఉదయం గొర్ల, మేకలతో యాటలను కోసి వంటలు చేస్తారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పెంచిన గోధుమ బుట్టలతో ను గిరిజన వేషాధారణ, సాంప్రదాయాలతో డప్పు వాయిద్యాలతో, డీజే సప్పుల్లా మధ్య తలపై ఎత్తుకొని గిరిజన నృత్యాలతో, ఆటపాటల మధ్య సాయంత్రం స్థానిక చెరువులో నిమజ్జనం చేస్తారు. పిల్లపాపలతో ఆయురారోగ్యాలతో, సకల సంపదలతో, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, యువతులు మంచి సంబంధాలు కుదరాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి బంధుమిత్రులతో కుటుంబ సమేతంగా మాంసాహారంతో సహపంక్తి భోజనాలు చేస్తారు. అక్కడితో తీజ్ మహా త్సవం బంజారాలు ఆ సంవత్సరం స్వస్తి పలుకుతారు.

# అభివృద్ధి పనులకు భూ కేటాయింపులు పకడ్బందీగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-పలు ప్రభుత్వ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



మంథని: మంథని పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన భూ కేటాయింపులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూములను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి విస్తృతంగా పరిశీలించారు.కాటారం క్రాస్ రోడ్ వద్ద గల పాత డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ భూమి లెవెలింగ్ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంబేద్కర్ కాలనీలోని బర్రెకుంట చెరువు పరిశీలించిన కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంథనిలోని మల్లేపల్లి డిగ్రీ కళాశాల సమీపంలో గల 5 ఎకరాల ప్రభుత్వ స్థలం, చైతన్యపురి కాలనీలోని బాయ్స్ హై స్కూల్, గర్ల్స్ హై స్కూల్, వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న దేవాదాయ శాఖ పరిధిలోని ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మంథని పట్టణంలో సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం, నూతన పురపాలక భవనం నిర్మాణం, సబ్ స్టేషన్ నిర్మాణం, నూతన రెవెన్యూ డివిజన్ అధికారి తహసిల్దార్ అధికారి కార్యాలయాల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టుటకు వీలుగా అనువైన ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంథని పట్టణంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల స్కెచ్ లను పూర్తి చేసి, ఏ అభివృద్ధి కార్యక్రమానికి ఎక్కడ వీలుగా ఉంటుందో వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అంతకుముందు రామగిరి మండలంలోని రాజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పేట గ్రామానికి సంబంధించి 708 ఎకరాల సింగరేణి భూసేకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమా నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే షి టీమ్ లక్ష్యం

**- విద్యార్థులు సెల్ఫోన్, డ్రగ్స్ కు దూరంగా ఉండాలి**

**- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తాం**

**- పట్టణ సిఐ వరగంటి రవి**



జమ్మికుంట: మహిళల భద్రతే షి టీమ్ లక్ష్యమని, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారికి అండగా షి టీమ్ అందుబాటులో ఉంటుందని పట్టణ సీఐ వరగంటి రవి ,షీ టీం అధికారి శ్రీలత అన్నారు . బుధవారం జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ హై స్కూల్, ప్రభుత్వ బాలికల పాఠశాల , కాకతీయ మహిళ జూనియర్ కళాశాలలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళల పట్ల ఎవరు అసభ్యకరంగా ప్రవర్తించ కూడదని, అలా చేస్తే వారికి చట్టంలో కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. మహిళలకు అండగా షి టీం ఎప్పుడూ పనిచేస్తూ ఉంటుందని, ఏ సమస్య వచ్చిన స్థానిక పోలీసులకు గాని షీ టీం అధికారులకు సమాచారం అందిస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు .విద్యార్థి దశ నుండే కష్టంతో కాకుండా ఇష్టపడి చదువుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు దురాలవాట్లకు దూరంగా ఉండాలని డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని అంతేకాకుండా సెల్ఫోన్ కు ఎంత దూరంగా ఉంటే అంత భవిష్యత్తు ఉంటుందని వారు తెలిపారు. సెల్ఫోన్ వాడకం ద్వారా మంచి ఎంత ఉందో అంతకంటే ఎక్కువగా చెడు ఉంటుందని కాబట్టి సెల్ఫోన్ అవసరాన్ని బట్టి మాత్రమే వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మీకు ఎప్పుడు ఎలాంటి సమస్యలు ఉన్నా మీ తల్లిదండ్రులకు కానీ, మీ గురువులకు లేదా స్థానిక పోలీసులకు, షీ టీం సభ్యులకు తెలపాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామెర సుధాకర్, విద్యోదయ హై స్కూల్ డైరెక్టర్ ఏ బూసి ఆర్యన్ కౌశిక్, కాకతీయ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జెర్రి పోతుల రవిబాబు, పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిని పీక్కెళ్లిన కుక్క

నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా బోధన్‌లో కలకలం రేపింది. చెట్టు కింద నిద్రపోతున్న పది నెలల చిన్నారిపై శునకాల గుంపు దాడి చేసి, దారుణంగా చంపేశాయి. బోధన్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకోగా.. వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఓ మహిళ యాచిస్తూ పొట్టపోసుకుంటుంది. ఆమెకు పది నెలల కుమారుడు ఉన్నాడు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో సోమవారం రాత్రి నిద్ర పోతున్న బాలుడిని ఆమె ఓ చెట్టు కింద ఉంచి, పనిమీద బయటకు వెళ్లింది. కాసేపటి తర్వాత వచ్చి చూస్తే చెట్టు వద్ద కుమారుడు కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. మంగళవారం ఉదయం కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. నెల క్రితమే బోధన్ తట్టికోట్‌లో ఓ చిన్నారిని నోట కరుచుకుని వెళ్లిన ఉదంతం మరువక ముందే ఈ విషాదం చోటు చేసుకోవడంతో స్థానికులను భయాందోళనకు గురవుతున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో నిత్యం ఎక్కడో ఒకచోట వీధికుక్కలు దాడి చేస్తూనే ఉంటాయి. తాజా ఘటనపై కేసు నమోదు చేసిన పట్టణ సీఐ వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు.బాలుడు అదృశ్యమైన ప్రాంతంలో పోలీసులు సోదాలు నిర్వహిస్తుండగా.. మంగళవారం తెల్లవారుజామున కుక్కలు ఓ చిన్నపిల్లాడ్ని నోట కరచుకుని వెళ్లినట్లు ఓ వ్యక్తి పోలీసులకు తెలిపాడు. అతడు చెప్పిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా, అక్కడక్కడ మాంసపు ముద్దలు కనిపించాయి. అవి చిన్నారి అవయవాలుగా గుర్తించి, వాటిని సేకరించి, బాలుడిని కుక్కలు చంపేసి పీక్కుతిన్నట్టు నిర్ధారించారు. అనంతరం దొరికిన మాంసం ముద్దలను బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చిన్నారిని వీధికుక్కలు పీక్కుతిన్న ఘటన వెలుగులోకి రావడంతో బోధన్‌లో కలకలం రేపింది. వీధికుక్కల బెడదతో అల్లాడిపోతున్న స్థానికులు తాజా ఘటనతో వణికిపోతున్నారు. కాగా ఇటీవల తట్టికోట్ ప్రాంతంలో ఓ బాలుడిని కుక్కలు మెడ పట్టుకుని ఎత్తుకెళ్తుండగా అడ్డుకున్న గర్భిణితోపాటు పలువురిపై దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ ఉదంతం మరిచిపోక ముందే మరో బాలుడు కుక్కలకు ఆహారంగా మారడం కలచి వేసింది. కుక్కల బెడద గురించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్లాస్టిక్ సంచులను, కవర్లను వాడవద్దు

**- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్**

**- ప్లాస్టిక్ సంచులు , పరిసరాలు పరిశుభ్రత పై అవగాహన**



జమ్మికుంట: ప్లాస్టిక్ సంచులను కవర్లను వాడవద్దని , బ్యాగులు ,బట్ట సంచులు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. బుధవారంజమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సంఘ సభ్యులకు పరిసరాల పరిశుభ్రత, సింగల్ యూస్ ప్లాస్టిక్ పై మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి మహిళా ముందడుగు వేసి పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుతూ, వర్షాల వల్ల నీరు నిల్వ ఉన్న చోట ప్రతి శుక్ర, మంగళ వారాలలో డ్రై డే నిర్వహించి, మీ ఇంటితో పాటు చుట్టూ పక్కల ఇండ్లలో కూడా డ్రై డే చేయు విధంగా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వార్డులలో వచ్చే చెత్త బండికి తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనాలకు అందించాలన్నారు. ప్రతి సంఘ సభ్యురాలు బ్యాంకు ద్వారా అందించే రుణాలతో ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగించాలని ఆయన అన్నారు.

కూరగాయలకు, ఇతర సామాగ్రి ప్లాస్టిక్ సంచులను, కవర్లతీసుకునేటప్పుడును వాడవద్దని, జ్యూట్ బ్యాగ్ లు, బట్ట సంచిని ఉపయోగించాలని ఆయన అన్నారు. మీతో పాటు ఇంటి చుట్టూ పక్కల వారికీ కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, సిఎల్ఆర్పీ మంజుల, ఆర్పీలు దేవేంద్ర, కె రజిత, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో సౌకర్యాల కల్పన కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**ఎం ఎల్ ఏ గండ్ర**

జయశంకర్ భూపాలపల్లి: ఎస్సి, బిసి,మైనార్టీ, గిరిజన, కెజిబివి రెసిడెన్షియల్ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పనకు యుద్ధ ప్రాతిపదికన అంచనాలు తయారు చేయాలి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశించారు. కోతులు రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. వసతులు కల్పనకు సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం విద్యా వ్యవస్థ కు నిధులు మంజూరుకు సిద్ధంగా ఉందనీ అన్నారు. ఎస్సి, బిసి, గిరిజన, మైనార్టీ, కెజిబివి పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు అందచేయాలని శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎస్సి, బిసి, గిరిజన, మైనార్టీ, కెజిబివి, పంచాయతి రాజ్, టిజి డబ్ల్యూఐడిసి, కెజిబివి ప్రత్యేక అధికారులు, ప్రదానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ తో మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ గోడ తక్కువగా ఉండటం వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కోతులు బెడద చాలా ఎక్కువగా ఉన్నదని కోతులు రాకుండా పటిష్టమైన మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని వసతి గృహాల్లో సోలార్ ప్లాంట్, ఆర్ ఓ మంచినీటి ప్లాంట్ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సిబ్బంది అవసరం ఉందని, ఖాళీలు భర్తీకి చర్యలు లిఖితపూర్వకంగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యార్థుల సంఖ్యను బట్టి అదనపు మరుగుదొడ్లు, తరగతి గదులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాధాన్యత పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీర్లు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మైదానం పరిశుభ్రం చేపించాలని, సున్నం వేయించాలని సూచించారు. పనులు జాప్యం కాకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. విద్యుత్ సమస్య శాశ్వత పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారుల ద్వారా ప్రత్యేక ఉప కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తున్నదని విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ధోభి ఘాట్ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సమస్య పరిష్కారానికి అంచనాలు తయారు చేయాలని అన్నారు. నిధులు ఇస్తాం ...ఇంజినీరింగ్ అధికారులు పనులు చేపించాల్సిన బాద్యత ఉందని పనుల్లో జాప్యం జరిగితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రమపద్ధతిలో పనులు పూర్తి చేయాలని ఒకటి చేసిన తరువాత మళ్ళీ పనులు చేస్తే చేసిన పనులకు తిరిగి మరమ్మతులు చేయాల్సి వస్తుందని అలాంటి సమస్య రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని అన్నారు. వసతి గృహా విద్యార్థుల సమస్యలు పరిశీలనకు రాత్రి బస చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, ఎస్సి, బిసి సంక్షేమ అధికారులు సునీత, శైలజ, పంచాయతి రాజ్ ఈ ఈ దిలీప్, టిజిఈడబ్ల్యూఐడిసి ఈ ఈ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల హక్కులు!.. ప్రభుత్వాల చట్టాలు ..

హైదరాబాద్;యావత్ దేశాన్నీ కుదిపేసిన 'కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన' నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును తీసుకొచ్చింది. మహిళలు ? పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అప్పుడెప్పుడో 2012లో జరిగిన 'ఢిల్లీ హత్యాచార ఘటన' సందర్భంగా 'నిర్భయ' చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం 'అపరాజిత' బిల్లును ఆమోదించింది.ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు ? చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

1 గృహహింసకు వ్యతిరేకంగా..

గృహహింస నిరోధక చట్టం ? 2005.. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

2 పనికి తగ్గ జీతం

సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం 'సమాన వేతన చట్టం' అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

3 పని ప్రదేశాల్లో రక్షణ

పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలుఈఅంతర్గత ఫిర్యాదులకమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

4 రాత్రిపూట అరెస్టు వద్దు

సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్‌తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

5 అజ్ఞాతం.. మీ హక్కు

లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. 'గోప్యత హక్కు' ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

6ఉచిత న్యాయ సేవ

లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

7గౌరవానికి భంగం వద్దు!

లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/ మానసిక పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధం.

# ఆర్టీసీ సిబ్బందిని అభినందించిన సజ్జనార్

హైదరాబాద్: ఆర్టీసీ సిబ్బంది కేవలం మనల్ని గమ్యస్థానాలకు చేర్చడవే కాదు, అవసరమైతే ఓ కుటుంబసభ్యుడిలా ప్రయాణికులను ఆదుకుంటారని ఇటీవల జరిగిన ఘటన నిరూపించింది. బస్సులో ప్రయాణిస్తున్న ఓ బాలుడికి అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో సకాలంలో స్పందించి ఆర్టీసీ డ్రైవర్లు సమపర్యలు చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. ఆర్టీసీ యాజమాన్యం తరఫున విద్యార్థి ప్రాణాలు కాపాడిన తమ సిబ్బందిని సజ్జనార్, మరికొందరు ఉన్నతాధికారులతో కలిసి సన్మానించారు. బస్సులో గుండె నొప్పితో బాధపడుతున్న విద్యార్థికి సకాలంలో వైద్య సాయం అందించిన తమ సిబ్బందిని తెలంగాణ ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. బైంసా డిపోనకు చెందిన కండక్టర్ జి.గంగాధర్, అద్దె బస్సు డ్రైవర్ బి.గంగాధర్‌ను హైదరాబాద్ బస్ భవన్ లో బుధవారం ఉన్నతాధికారులతో కలిసి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ సిబ్బందికి నగదు బహుమతులు సైతం అందజేశారు.సెప్టెంబర్ 9న బైంసా నుంచి నిర్మల్‌కు బస్సు వెళ్తోంది. దిలావర్‌పూర్ వద్దకు రాగానే 12 ఏళ్ల విద్యార్థి కిరణ్‌కు ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ జి.గంగాధర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపాలని సూచించారు. డ్రైవర్ బి.గంగాధర్‌తో కలిసి బాలుడు కిరణ్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. సీపీఆర్ చేశారు. అనంతరం కిరణ్‌ను ఆర్టీసీ బస్సులోనే సమీపంలో ఉన్న నర్సాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో విద్యార్థి కిరణ్‌కు ప్రాణాప్రాయం తప్పిందని డాక్టర్లు తెలిపారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి 12 ఏళ్ల విద్యార్థి ప్రాణాలను కాపాడిన కండక్టర్ బి.గంగాధర్, డ్రైవర్ బి.గంగాధర్ లను ఈ సందర్భంగా ఎఉూఖీఱఅ ఎండీ సజ్జనార్ మెచ్చుకున్నారు. ఆపద సమయంలో సేవాతర్పరతను ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం గొప్ప విషయమని కొనియాడారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు.. ఆపద సమయంలో తాము ఉన్నామని భరోసా కల్పించినందుకు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్, ఫైనాన్స్ అడ్వ?జర్ విజయపుష్ప, బైంసా డిపో మేనేజర్ హరిప్రసాద్, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శ్రీదేవి, చీఫ్ పర్సనల్ మేనేజర్ ఉషాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# రూ.8000 లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల పంచాయతీ కార్యదర్శి ఎసపల్లి నవీన్ కుమార్ తన కార్యాలయంలో లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. ఓ వ్యక్తి నుంచి రూ.8వేలు లంచం డిమాండ్ తీసుకుంటుండగా తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది.

ఫిర్యాదుదారుడి కొత్త ఇంటి నంబర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి నవీన్ కుమార్ లంచం అడిగాడు. నవీన్ కుమార్ దగ్గర నుండి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని ట్రౌజర్, కుడి చేతి వేళ్లు, ట్రౌజర్ కాంటాక్ట్ భాగం పాజిటివ్‌గా నిర్ధారించారు. అక్రమంగా డబ్బులు సంపాదించడం కోసం తన వృత్తిని నవీన్ కుమార్ అడ్డంగా పెట్టుకున్నాడని అధికారులు కుమార్‌ను హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ప్రభుత్వోద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్-1064ను సంప్రదించాలని ఏసీబీ ప్రజలను కోరింది. ఫిర్యాదుదారు వివరాలు రహస్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.



# కొండారెడ్డిపల్లి సోలార్ కరెంట్ రికార్డు

మహబూబ్ నగర్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి.. రికార్డుకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలోనే తొలి గ్రామంగా వెలిగిపోయేందుకు రెడీ అవుతోంది. ఈ మేరకు.. అధికారులు సర్వే కూడా ప్రారంభించారు. ఇంతకూ ఏ రికార్డు అనేగా మీ డౌటనుమానం. అదేనండి.. తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలోనే పూర్తిస్థాయి సోలరైజ్డ్ గ్రామంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే.. కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలో మోడల్ సోలార్ విలేజ్‌గా మార్చే ప్రక్రియను సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగానే.. టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖీతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, రెడ్కో వీసీ, ఎండీ అనిల, సంస్థ డైరెక్టర్ కే రాములు, ఇతర శాఖల ముఖ్య అధికారులంతా.. కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. గ్రామస్తులు, రైతులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు మాట్లాడి.. ఈ పైలట్ ప్రాజెక్టు వివరాలు వివరించారు. అయితే.. కొండారెడ్డిపల్లిలో సుమారు 499 గృహ వినియోగదారులు, 66 కమర్షియల్ కస్టమర్లతో పాటు 867 వ్యవసాయ వినియోగదారులు, ఇతర కేటగిరిలతో కలుపుకుని మొత్తంగా 1451 విద్యుత్ వినియోగదారులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే.. ఈ మోడల్ ప్రాజెక్ట్ అమలు చేసే ప్రక్రియలో భాగంగానే.. గ్రామంలో మంగళవారం నుంచి ఇంటింటి సర్వే కూడా చేయడం మొదలుపెట్టారు. ఈ సర్వే ద్వారా గ్రామానికి అవసరమైన సౌర విద్యుత్ కెపాసిటీని అంచనా వేసి.. డీపీఆర్ తయారు చేయటంతో పాటుగా.. ఇతర ప్రక్రియలను కూడా అధికారులు మొదలుపెట్టున్నారు. దీంతో.. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి సౌర విద్యుత్ కాంతులతో వెలుగిపోనుంది. ఫలితంగా.. రాష్ట్రంలోనే పూర్తిస్థాయి తొలి సోలరైజ్డ్ విలేజ్‌గా కొండారెడ్డిపల్లి రికార్డు క్రియేట్ చేయనుంది. ఇదిలా ఉంటే.. ఇప్పటికే సీఎం రేవంత్ రెడి స్వగ్రామంగా కొండారెడ్డిపల్లికి చాలా పాపులారిటీ వచ్చింది. సొంత గ్రామానికి సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం గతంలో నుంచే పలు సేవా కార్యక్రమాలు చేస్తుండగా.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ రకరకాల అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే.. ఇప్పుడు ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తీసుకొస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.

# 9 నెలల్లో 76 వేల కోట్ల అప్పు

హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రెండు సార్లు బీఆర్ఎస్ పార్టీనే అధికారం చేపట్టగా.. మూడోసారి కాంగ్రెస్ సర్కార్ అధికారం రుచిచూసింది. అయితే.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు, సంచలన ఆరోపణలు చేస్తూనే ఉంది. అందులో ముఖ్యంగా అప్పుల విషయంలో.. నిత్యం విమర్శిస్తూనే ఉంది. మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను.. అప్పుల కుప్పగా మార్చేశారని దుయ్యబడుతూనే ఉంది. రాష్ట్రంలో చేపట్టిన ప్రతి పనిలో అవినీతి చేసిందని.. లక్షల కోట్లు అప్పు చేసి ప్రజలపై తీవ్ర భారం వేసిందంటూ విమర్శలు చేస్తోంది. కేసీఆర్ సర్కార్ చేసిన అడ్డగోలు అప్పులకు.. రాష్ట్రంలో వచ్చే ఆదాయం వడ్డీ కట్టేందుకే సరిపోతుదంటూ సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లో చేసిన అప్పుల చిట్టా పద్దుపై సోషల్ మీడియాలో పోస్టులు తెగ వైరల్ అవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల గురించి పదే పదే ప్రస్తావించే సీఎం రేవంత్ రెడ్డి.. 9 నెలల్లోనే.. ఏకంగా 75,995 వేల కోట్ల అప్పు చేసినట్టుగా బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. నెలలు, తేదీలతో సహా ఎప్పుడెప్పుడు ఎంతెంత అప్పు తీసుకున్నారనేది సోషల్ మీడియాలో క్లియర్‌గా పోస్టుల రూపంలో పేర్కొంటున్నారు. ఇప్పటికే.. జులైలో జులైలో రూ.7000 కోట్లు, ఆగస్టులో రూ.6000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేయగా.. సెప్టెంబర్ 3వ తేదీన 1000 కోట్లు అప్పు తీసుకుంది. కాగా.. ఈరోజు (సెప్టెంబర్ 10న) మరో 1500 కోట్లు అప్పు చేయనున్నట్టు వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రేవంత్ సర్కార్ మొత్తం రూ.75,995 కోట్లు అప్పు చేసినట్టు చెప్తున్నారు. అందులో కేవలం బాండ్లు తాకట్టు పెట్టే రూ.46,118 కోట్లు అప్పు చేసినట్టుగా పేర్కొంటున్నారు. ఇక మిగతా రూ.29,877 కోట్లు వివిధ కార్పొరేషన్ల నుంచి అప్పు తీసుకున్నట్టు చెప్తున్నారు. అయితే.. ఇప్పుడు తాజాగా తీసుకొనున్న 1500 కోట్లు కూడా బాండ్ల వేలం ద్వారానే ఆర్బీఐ నుంచి తీసుకోనుందని పోస్టులు పెడుతున్నారు. డిసెంబర్ 07 కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగా.. డిసెంబర్ 12వ తేదీ నుంచి రేవంత్ ప్రభుత్వ అప్పులు చేయటం మొదలు పెట్టిందంటూ పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు.. అప్పటి నుంచి ఈరోజు వరకు రేవంత్ సర్కార్ చేసిన అప్పుల చిట్టా పద్దును సోషల్ మీడియాలో పెడుతున్నారు. మరి ఈ చిట్టా పద్దులో ఎంత వరకు నిజముందనేది తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలే చెప్పాలి మరి..!

# వేములవాడ సమస్య తీరినట్టేనా..?

కరీంనగర్: వేములవాడ రాజరాజేశ్వర స్వామి భక్తుల కష్టాలకు మోక్షం లభించనుంది. ఏళ్లనాటి కల తొందర్లోనే నెరవేరనుంది. రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు అటు ఆలయంలోనూ.. ఇటు ఆలయం బయట పరిసరాల్లోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్న విషయం అందరికీ తెలిసిందే. ఆలయం లోపల సరైన నిర్వాహణ లేకపోవటమో.. లేక సరైన ఏర్పాటు చేయకపోవటమో కానీ.. మొత్తానికి రాజన్న దర్శనానికి వెళ్లే భక్తులకు మాత్రం క్యూలైన్లలో తిప్పలు తప్పటం లేదన్నది.. అందరికీ తెలిసిన కఠోర వాస్తవం. మరోవైపు.. దర్శనం చేసుకుని బయట సరదాగా షాపింగ్ చేద్దామనో.. లేదా పోచమ్మ గుడికో, భీముని ఆలయానికో.. లేదా గదులకో, బస్టాండుకో వెళ్దామంటే కూడా ఆ ఇరుకైన రోడ్డులో, రద్దీలో నడవాలంటేనే నరకం కనిపిస్తుంది. ఇక వాహనదారులకైతే చుక్కలు కనిపించాల్సిందే. ఎప్పుడెప్పుడు ఆ రోడ్ల విస్తరణ చేస్తారా.. ఈ కష్టాలు ఎప్పుడు తీరుతాయా అని భక్తులతో పాటు స్థానికులు కూడా ఏళ్లుగా ఎదురుచూస్తుండగా.. ఇన్నాళ్లకు శుభవార్త వినిపించింది. ఇక ట్రాఫిక్ కష్టాలు దూరం కావటంతో పాటు మెరుగైన వసతులు కూడా అందుబాటులోకి రానున్నాయి. వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి గుడి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 ఫీట్ల వెడల్పు చేసే పనులకు సర్కారు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే.. భూసేకరణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయింది. రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం నుంచి భూ సేకరణ నిమిత్తం ప్రకటన విడుదలైంది. దీంతో.. రోడ్డు విస్తరణ పనులకు మొదటి అడుగు పడింది. అయితే.. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం రేవంత్ సర్కార్ ఇప్పటికే 50 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కాగా.. ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనులకు కూడా ముందడుగు పడటంతో.. స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు.. వేములవాడ ఆలయంలో తిరుపతి తరహాలో భక్తులకు వేగంగా దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శనాన్ని కూడా అమలులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో కోడెల సంరక్షణకు మూడు షెడ్లు నిర్మించారు. దాంతో పాటు గోశాలలో సీసీ నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణానికి కూడా పనులు మొదలుపెట్టారు. ఇదిలా ఉంటే.. తిరుమల తరహాలోనే వేములవాడలో కూడా భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కాగా.. నిత్యాన్నదాన సత్రం కోసం.. ఆలయం సమీపంలోని శివార్చన స్టేజి దగ్గర సత్రం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు.

# జైనూరు ఘటనపై లౌకిక వాదులు మౌనమేనా

హైదరాబాద్: అంకుశం సినిమాలో విలన్ రామిరెడ్డికి పట్టిన గతే కేసీఆర్ కుటుంబానికి పడుతుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు కేంద్రమంత్రి బండి సంజయ్. శేరిలింగంపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి మాట్లాడారు. కేసీఆర్ కుటుంబాన్ని జైలులో వేయడం రేవంత్‌కు సాధ్యం కావడం లేదన్నారు. ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలతో కేసీఆర్ మాట్లాడుకుని వచ్చారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే కేసీఆర్ అంతు చూసేటోళ్లమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన దశమ గ్రహమని, నవగ్రహాల పూజలు చేయడం విడ్డూరమని సెటైర్లు వేశారు. వరదలతో జనం అల్లాడుతుంటే ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రజలు కేసీఆర్‌కు నో ఎంట్రీ బోర్డు పెట్టేశారన్న బండి, ఇక రీ ఎంట్రీ కలేనని వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీల హామీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా పేరుతో కాంగ్రెస్ హైడ్రామా ఆడుతోందని విమర్శించారు. దేశ ప్రజలారా కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగండని పిలుపునిచ్చారు. అత్యధిక సభ్యత్వం నమోదు చేసిన డివిజన్ కార్యకర్త లను తాను సన్మానిస్తానని అన్నారు. ఈసారి జీహెచ్ఎంసీ మేయర్ బీజేపీదేనన్న సంజయ్, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి పోటీ చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. లౌకిక వాదులారా జైనూర్ ఘటనపై నోరెందుకు మెదపడం లేదని, హిందూ పండుగలపై ఆంక్షలు పెడుతుంటే ఎందుకు స్పందించరని నిలదీశారు. జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించని వాళ్లు తన దృష్టిలో భారతీయులే కాదని స్పష్టం చేశారు. ఇక, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై స్పందించిన బండి సంజయ్, రిజర్వేషన్లపై నోటికొచ్చినట్లు మాట్లాడారని మండి పడ్డారు. రాహుల్ క్విట్ ఇండియా అంటూ నినదించారు. విదేశా లకు వెళ్లి భారత ఎన్నికల వ్యవస్థను విమర్శించడం కరెక్ట్ కాదని మండిపడ్డారు

# ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించిన బత్తుల భబిత

## అవగాహనతోనే ఎయిడ్స్ అంతం

## హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండడం వల్లనే ఆ వ్యాధిని అంతం చేయవచ్చు

జమ్మికుంట: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ డిఎస్ఆర్పి కౌన్సిలర్ బత్తుల బబిత అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులచే ఎయిడ్స్ పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బబిత మాట్లాడుతూ వృత్తిలో భాగంగా చాలా రోజులపాటు ఇంటిని వదిలి సుదూర ప్రదేశాలకు వెళ్లవలసి వస్తుందని, అలాంటి సమయంలో పర స్త్రీలతో కలవడం వల్ల హెచ్ఐవి వచ్చే అవకాశాలు ఉన్నాయని డ్రైవర్స్ కు తెలియజేశారు. హెచ్ఐవి సోకిన వ్యక్తులు అధైర్య పడకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించుకొని సరియైన మందులు వాడడం ద్వారా ఆ వ్యాధిని పెరగకుండా చూడవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్ఐవి ఎయిడ్స్ పై ప్రత్యేక దృష్టి సారించి అనేకమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి మంచి ఆరోగ్యంతో పాటు మంచి కుటుంబాన్ని ఏర్పరచుకొని ఉండాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని దీని ద్వారా మన శరీరంలో ఉన్న రుగ్మతల గురించి తెలుసుకునే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షులు పొన్నగంటి మల్లయ్య, అధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శి రియాజ్ తోపాటు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు..

# కాళోజీ కళాక్షేత్రానికి రాజకీయ రంగు

వరంగల్: ఓరుగల్లుకు ఐకాన్‌గా నిలిచిన కాళోజీ కళాక్షేత్రం ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య క్రెడిట్ ఫైట్‌కు దారి తీసింది. ఈ క్రెడిట్ ఫైట్‌లో ఆ అపురూప నిర్మాణం మరోసారి హాట్ టాపిక్ గా మారింది. ఆ చారిత్రక నిర్మాణం క్రెడిట్ మాదంటే మాదే అంటూ ఇరు పార్టీల నేతలు సవాళ్లు విసురుకుంటున్నారు. అక్షర రూపం దాల్చిన ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలికను తెలిపిన గొప్ప కవి.. హక్కుల కోసం తన కలంతో గళమెత్తి నిగ్గదీసి కడిగేసిన ప్రజల మనిషి ప్రజాకవి కాళోజీ నారాయణరావు. పుట్టుక నీది ? చావు నీది. బతకంతా సమాజానిది అని మనిషి జీవిత సత్యాన్ని తన కవితల ద్వారా వివరించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజి. తెలంగాణ అస్తిత్వ పోరాటం కోసం తన కలంతో గళమెత్తి గర్జించిన కాళోజీ నారాయణరావు జ్ఞాపకార్థం హనుమకొండలో అపురూప నిర్మాణం రూపుదిద్దుకుంది. రవీంద్రభారతిని మరిపించేలా నిర్మాణమైన కాళోజీ కళాక్షేత్రం ఇప్పుడు ప్రజల చేత ప్రశంసలు అందుకుంటుంది. ఆ నిర్మాణం చూసి ఓరుగల్లు ప్రజలంతా వాహ్ అంటున్నారు. ఓరుగల్లు కు ఐకాన్ గా నిలిచిన ఈ భారీ నిర్మాణం ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. కాలోజీ కళాక్షేత్రం క్రెడిట్ మాదంటే మాది అంటూ ఇరు పార్టీల నేతలు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. 2014లో మేము శంకుస్థాపన చేశాం.. అనివార్య కారణాల వల్ల పూర్తి చేయలేకపోయాం. కానీ ఆ క్రెడిట్ అంతా కాంగ్రెస్ వారి ఖాతాలో వేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తూ హడావుడి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దాస్య వినయ్ భాస్కర్ ఆరోపించారు. కేవసం రంగులు మాత్రమే వారు వేశారని విమర్శలు చేశారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం విమర్శలపై తాజా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శంకుస్థాపన చేసే పదేళ్లు గడిచిన పూర్తి చేయని దద్దమ్మలు మీరు అని ఆరోపించారు. పదేళ్ల కాలంలో కేవలం రూ. 40 కోట్లు ఖర్చుపెట్టి స్కెల్టన్ లా వదిలేసిన కాళోజీ కళాక్షేత్రాన్ని వెంటపడి పూర్తి చేశానని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో అదనంగా మరో రూ. 45 కోట్ల నిధులు తీసుకొచ్చి కేవలం 8 నెలల వ్యవధిలోనే కాళోజీ కళాక్షేత్రం పూర్తిచేసి ప్రజలకు అంకితం ఇవ్వబోతున్నానని నాయిని అన్నారు.. వినయ్ భాస్కర్ రాజకీయ జీవితమంతా కబ్జాలు, కమిషన్లు తప్పా, ప్రజలకు ఏం చేశాడో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అంతేకాదు అబద్ధాలు ఆడడంలో ఆయనను మించిన వారు లేరు. ఇదే కళాక్షేత్రంలో దాస్యంకు నట విరాట పరాటా గోకర్ణ అనే అవార్డు ఇవ్వాలని సీఎంకు సిఫారసు చేస్తానని ఎమ్మెల్యే నాయిని అన్నారు. అయితే కాళోజీ కళాక్షేత్రం వివాదంపై ఓరుగల్లు ప్రజలు, ప్రజాప్రతినిధులు, మేధావులు విద్యావేత్తలు, కళాకారులు బిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సరిగ్గా పదేళ్ల క్రితం 2014 సెప్టెంబర్ 9వ తేదీన కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హనుమకొండలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి పునాది రాయి వేశారు. పదేళ్లు గడిచిన కాలేజీ కళాక్షేత్ర నిర్మాణాన్ని 50% శాతం కూడా పూర్తి చేయలేదు. అసంపూర్తిగా మిగిలిపోయిన కాళోజీ కళాక్షేత్రం అనేక విమర్శలు మూటకట్టుకుంది. నేతలపై అనేక విమర్శలు వెల్లువెత్తాయి. దీని తర్వాత మొదలుపెట్టిన అనేక నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులో ప్రభుత్వ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తున్నారు. కానీ కాళోజీ కళాక్షేత్రం ఎందుకు పూర్తి చేయడం లేదనే విమర్శలు వెల్లు వెత్తాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కాళోజీ కళాక్షేత్రం వెంటపడి దానికి ఒక రూపం తీసుకొచ్చారని ఆయనను ఓరుగల్లు మేధావులు కళాకారులు ప్రశంసిస్తున్నారు.

# భర్త ఇంటిముందు మొదటి భార్య ఆందోళన

కరీంనగర్: అమ్మయిలు పుట్టడంతో.. అబ్బాయి కోసం భర్త మరో పెళ్లి చేసుకున్నాడు.. ఆ తర్వాత ఉన్నదంతా ఆ భార్యకే కట్టబెడుతుండటంతో .. మొదటి భార్య ఆందోళనకు దిగింది. ఈ ఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకుంది. ఉన్న ఆస్తి అంత రెండో భార్యకే కట్టబెడుతున్నాడంటూ కూతురుతో కలిసి భర్త ఇంటిముందు మొదటి భార్య ఆందోళనకు దిగింది. తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానంటూ భీష్మించుకుని కూర్చుంది. వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన జంగా సంజీవ రెడ్డి.. వనజకు 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు ఆడపిల్లలు పుట్టడం తో వారసుడు లేడని సంజీవరెడ్డి మరో మహిళను వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు ఓ కొడుకు పుట్టాడు. అప్పటి నుండి సంజీవరెడ్డి మొదటి భార్య వనజ గొడవ పడుతుండేవాడు.. వేధింపులు ఎక్కువయ్యాయి.. భర్త టార్చర్ భరించలేక వనజ తన పుట్టిల్లు అయిన మాన కొండూరు మండలం చల్లూరుకు తన ఇద్దరు కూతుర్లతో వెళ్లిపోయింది. అయితే సంజీవరెడ్డి రెండో భార్యకు ఓ కుమారుడు ఉన్నాడు. అతని పేరిట ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేయించాడని మొదటి భార్య వనజ పేర్కొంది.. తన కూతుర్లు శ్రీ వర్ష, శ్రీజ ప్రస్తుతం ఉన్నత చదువులు చదువుతున్నారని, వారిని చదివించి, పెళ్లి చేసే స్తోమత కూడా తన వద్ద లేదని, ఆస్తి మొత్తం రెండో భార్య కుమారుడికి రాసిస్తే తన పిల్లల పరిస్థితి ఏంటని, అత్తింటి ముందు బైఠాయించి కూతురుతో ఆందోళన చేపట్టింది భార్య వనజ.. అయితే ఈ విషయం తెలుసుకున్న భర్త సంజీవరెడ్డి ఇంటి వైపు రావడంలేదని, ఇంట్లోని అత్తమామలు తమను ఇంట్లోకి రానివ్వడం లేదని, రాత్రంతా ఆరుబయటే నిద్రించామని వనజ తెలిపింది.. కనీసం మంచినీరు కూడా ఇవ్వకుండా తాళం వేసుకొని వెళ్లిపోయారని బోరున విలపిస్తున్నారు వనజ, కూతురు శ్రీ వర్ష. వంశోద్ధారకుడు లేడన్న సాకుతో మొదటి భార్య వనజను, ఇద్దరి ఆడపిల్లలను దూరం పెట్టాడని తమకు న్యాయం చేయాలని మీడియా ముందు తన గోడు వెళ్ళబోసుకుంది మొదటి భార్య వనజ. తమకు న్యాయం చేయాలని కోరిన.. తన తండ్రి ఏమాత్రం సమాధానం ఇవ్వడం లేదని.. పట్టించుకోవడం లేదని కూతురు శ్రీవర్ష పేర్కొంది.

# ఉప ఎన్నికల్లో సత్తా చూపిస్తాం

హైదరాబాద్: ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీఆర్ఎస్ దూకుడుగా వ్యవహరిస్తోంది. త్వరగా నిర్ణయం తీసుకోవాలంటూ బుధవారం అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులును కలిశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై హైకోర్టు వెలువరించిన తీర్పును వెంటనే అమలు చేయాలని సెక్రటరీకి తెలిపారు. సమావేశం తర్వాత తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు వివేకానంద, కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దానం నాగేందర్‌తో పాటు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై కాలయాపన చేయకుండా చర్యలు ప్రారంభించాలని అసెంబ్లీ సెక్రటరీకి వినతిపత్రం ఇచ్చామన్నారు వివేకానంద. అలా కాదని టైం పాస్ చేసేలా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాలంటే ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. మిగతా ఏడుగురు ఎమ్మెల్యేలపై పిటిషన్ స్పీకర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందన్నారు. అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబుపై తమకు గౌరవం ఉందని, ఆయన తన గౌరవాన్ని తగ్గించుకునే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు వేయాలని దేశం మొత్తం రాహుల్ గాంధీ చెప్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అరికెపూడి గాంధీ ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు చెప్పాలని అన్నారు. హైకోర్టు తీర్పు తర్వాత బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు ఒక్కో రకంగా మాట్లాడుతున్నారని, వారిని రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. పది మంది ఎమ్మెల్యేల భవిష్యత్‌కు రాజకీయ సమాధి కట్టారని వ్యాఖ్యానించారు వివేకానంద. రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం తథ్యమని, పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అనేలా ఉందని సెటైర్లు వేశారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలు వస్తాయని తెలిసి పార్టీ మారిన ఎమ్మెల్యేలు గజగజ వణుకుతున్నారని అన్నారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ బిచ్చగాడు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని, కడియం శ్రీహరి పచ్చి మోసగాడు అంటూ మండిపడ్డారు. పొద్దున కేసీఆర్ దగ్గర బ్యాగులు తీసుకుని వెళ్లి సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆరోపించారు. అరికెపూడి గాంధీ తాను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని అంటున్నారని, మాట మార్చారని మండిపడ్డారు. స్పీకర్ నిర్ణయం దాకా ఆగకుండా ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉప ఎన్నికలను ఎదుర్కోవాలని సవాల్ చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆ పది సీట్లలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు కౌశిక్ రెడ్డి. కేసీఆర్ విడిగా ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేను చేర్చుకున్నారని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ఎల్పీలో సీఎల్పీ విలీనం జరిగిందని స్పష్టం చేశారు. అరికెపూడి గాంధీ తమ పార్టీ సభ్యుడు అయితే తెలంగాణ భవన్‌కు రావాలని అన్నారు.

# వరద బాధితుల సహాయాన్ని లక్షకు పెంచాలి

**– ముంపు ప్రాంతంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ నిర్మించాలి**

**– సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డిమాండ్**

ఖమ్మం: సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర ప్రతినిధి బృందం బుధవారం నాడు మున్నేరు వరద బాధిత ప్రాంతాలలో పర్యటించి బాధితులతో ఓదార్పు చేశారు ఈ ప్రతినిధి బృందం తొలిత మంచి కంటి నగర్ బొక్కలగడ్డ వెంకటేశ్వర్ నగర్ అనంతరం రాజీవ్ స్వగృహ ఏరియాలోని ముంపుగురైన ఇళ్లను దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి సర్వం కోల్పోయిన ముంపు బాధితులతో పలకరిస్తూ వారి బాధలను స్టడీ చేశారు ఈ సందర్భంగా ×సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే రంగయ్య జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు ప్రగతిశీల ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వి ప్రభాకర్ లు మాట్లాడుతూ వరద ప్రభావాన్ని ముందే అంచనా ఏసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం తొలిత విఫలమైందని వరదలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని దీని కారణంగా ఎక్కువ ఆస్తి నష్టం వాటిల్లిందని వారు అన్నారు పేద మధ్యతరగతి ఇండ్లు నీరు పట్టడం కారణంగా రెండు నుంచి ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని వారు తెలియజేశారు లక్షలాది రూపాయలు నష్టపోతే కేవలం 16,500 ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏమిటని వారు ప్రశ్నించారు . ఖమ్మం జిల్లాలో వరద కారణంగా 20 వేల ఇళ్లకు పైగా వరదలో చిక్కుకున్నాయని ఇంటికి లక్ష రూపాయల చొప్పున బాధితులకు అందజేయాలని అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున అందించే వారిని ఆదుకోవాలని వారు డిమాండ్. చేశారు ప్రతి సంవత్సరం వరదలతో కోట్లాది రూపాయల ప్రజల ఆస్తి నీళ్ల పాలు అవుతుంటే ముందస్తు ప్రణాళిక ప్రకారం వరద ముప్పు ఖమ్మానికి పట్టకుండా చర్యలు చేపట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు వరద ప్రాంతాల్లో ఉన్న పేదలను ఖాళీ చేయించి వారందరికీ 150 గజాలలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు వరద కారణంగా చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాన్ని 25 లక్షల కూడా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం ఖమ్మం వరద పై ఇంతవరకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని తక్షణమే కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు .ఈ ప్రతినిధి బృందంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిన్న చంద్రన్న ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పుల్లయ్య ఆవుల అశోక్ ఝాన్సీ శోభ మంగతాయి సురేష్ కే శ్రీను భరత్ సత్తార్ ధరణి కృష్ణ వెంకటేష్ లక్ష్మణ్ రవీందర్ శారద జాస్మిన్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య మందిరం నుంచి 400 కోట్ల జీఎస్టీ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరం భారతదేశంలోని ప్రధాన పర్యాటక ప్రాంతంతో పాటు మతపరమైన నగరంలో చేరింది. రామ మందిరం కట్టినప్పటి నుంచి ఇక్కడికి వచ్చే సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. రామ మందిరాన్ని చూసేందుకు దేశ, విదేశాల నుంచి ప్రజలు వస్తున్నారు. ఆలయంలో నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశం తర్వాత, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ ఇప్పుడు రామ మందిరానికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనుల ద్వారా జీఎస్‌టీ మొత్తం రూ.400 కోట్లు వస్తుందని చెప్పారు. ఇది ఒక అంచనా అయినప్పటికీ పనులు పూర్తయిన తర్వాతే అసలు పన్ను ఎంతన్నది తేలనుంది. అయితే ఈ ఆలయ నిర్మాణాలకు సంబంధించిన ఆసక్తికర వివరాలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తాజాగా వెల్లడించారు. మహర్షి వాల్మీకి, శబరి, తులసీదాస్ ఆలయాలతో సహా 70 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 18 ఆలయాలు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వానికి 100శాతం పన్ను చెల్లిస్తామని? ఒక్క రూపాయి కూడా బకాయి పెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. అయోధ్యలో చేపడుతున్న ఆలయాల ద్వారా ప్రభుత్వానికి రూ.400 కోట్ల వరకు ఊా వసూలయ్యే అవకాశం ఉందని అంచనా వేసారు. పనులు పూర్తయిన తర్వాత ఖచ్చితమైన పన్ను మొత్తం తెలుస్తుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు. సంఘం సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయానికి రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది ఉండదు. గుడి నిర్మాణం విషయంలో జరిగిన ఉద్యమంలో చాలా మంది ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ ఉద్యమం వెయ్యి సంవత్సరాల క్రితం జరిగిన స్వాతంత్ర్య పోరాటం కంటే తక్కువేం కాదన్నారు. ఆలయ ప్రాంగణంలో శివాలయాన్ని కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ఉన్న బకవా గ్రామం అద్భుతమైన శివలింగ నిర్మాణానికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడ శివలింగ నిర్మాణానికి దేశ, విదేశాల నుంచి ఆర్డర్లు వస్తాయి. రామమందిర ప్రాంగణంలో ప్రతిష్టించే శివలింగం కూడా ఇక్కడే రూపుదిద్దుకుంటోందని చంపత్ రాయ్ వెల్లడించారు

# కలకలం రేపుతున్న షిండే వ్యాఖ్యలు

శ్రీనగర్: .సుశీల్ కుమార్ షిండే ప్రకటన తర్వాత అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పుడు కాశ్మీర్ మారిందని సుశీల్ కుమార్ షిండే అంగీకరించారా, కాశ్మీర్ ఇప్పుడు సురక్షితంగా ఉందని షిండే అంగీకరించారా, 370ని తొలగించడాన్ని కాంగ్రెస్ నాయకుడు సైగలలో ప్రశంసించారా, కాశ్మీర్‌పై మోదీ ప్రభుత్వ విధానాన్ని షిండే ఆమోదించారా, లోయ బాగుందని షిండే అభివర్ణించారా? కాంగ్రెస్ ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడు ఉద్రిక్త పరిస్థితి ఆగిపోయిందా? అన్నదీ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జమ్మూ కశ్మీర్‌లో టూరిజం జోరుగా సాగుతోంది. శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో ఒకప్పుడు పాకిస్థాన్, ఐఎస్ఐఎస్ జెండాలు కనిపించేవి. కానీ ప్రస్తుతం త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతోంది. భూతల స్వర్గంగా భావించే కాశ్మీర్ అందాలను నిర్భయంగా ఆస్వాదిస్తున్నారు. అయితే, ఒకప్పుడు లాల్ చౌక్ అంటే భయపడే వాళ్ళమని మాజీ కేంద్ర హోం మంత్రి చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో హోంమంత్రిగా ఉన్న సుశీల్ కుమార్ షిండే స్వయంగా ఈ విషయాన్ని ఒప్పుకుంటున్నారు. శ్రీనగర్‌కు వెళ్లి మరీ పబ్లిసిటీ తెచ్చుకున్న ఆయన నిజానికి కాశ్మీరీలు నలిగిపోయారన్నారు. సుశీల్ కుమార్ షిండే రచించిన 'ఐదు దశాబ్దాల రాజకీయం' పుస్తకాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారుషిండే సంచలన వ్యాఖ్యలు చేసిన సందర్భంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రెండుసార్లు ఎంపీగా పనిచేసిన దిగ్విజయ్ సింగ్, ప్రముఖ విద్యావేత్త విజయ్‌ధర్ వంటి రాజకీయ ప్రముఖులు కూడా ఉండటం విశేషం. తన పుస్తకంలో పేర్కొన్న అంశాల్లో ఒకదాన్ని ప్రస్తావిస్తూ, కాశ్మీర్‌లో తాను భయపడ్డాన్నానని షిండే అన్నారు. విద్యావేత్త విజయ్‌ధర్ సుశీల్ షిండేకు అత్యంత సన్నిహితుడు. ఇంతకుముందు హోంమంత్రిగా ఉన్నప్పుడు, విజయ్ ధర్ వద్దకు వెళ్లి సలహా అడిగేవాడిని, అయితే అక్కడా ఇక్కడా తిరుగొద్దు అని సలహా ఇచ్చాడన్నారు. కాశ్మీర్‌లోని లాల్ చౌక్‌కి వెళ్లి అక్కడ ప్రసంగం చేసి, కొంతమందిని కలిసి దాల్ సరస్సులో తిరిగాలని ధర్ సలహా ఇచ్చారు. ఆ సలహాతో చాలా ప్రచారం వచ్చింది. ఎలాంటి భయం లేకుండా వెళ్లే హోం మినిస్టర్ ఉన్నారని జనాల్లో నమ్మకం కుదిరింది. కానీ ఎవరికి చెప్పుకోలేని భయం లోలోపల ఉండేది" అని మాజీ హోంమంత్రి సుశీల్ షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. షిండే ఇలా చెప్పడంతో వేదిక ఒక్కసారిగా నవ్వులతో మారుమోగింది. దీంతో కాంగ్రెస్ నేత 'నిజమే.. కానీ మిమ్మల్ని నవ్వించడానికే అన్నాను కానీ ఓ మాజీ పోలీసు ఇలా అనలేదు' అని అన్నారు. విజయ్ ధర్ సుశీల్ కుమార్ షిండే సన్నిహితులలో ఒకరు. ఆయన అభ్యర్థన మేరకు షిండే కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు శ్రీనగర్‌లోని పాఠశాలను సందర్శించారు. ఆ స్కూల్ హెడ్ కూడా విజయ్ ధరే. యూపీఏ ప్రభుత్వ హయాంలో జమ్మూ కాశ్మీర్‌లో భయాందోళనలు నెలకొని ఉన్నాయని షిండే చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా రాజకీయ దుమారం రేగింది. భారతీయ జనతా పార్టీ ఆర్టికల్ 370 రద్దుతోనే అది సాధ్యమైందంటూ చెప్పుకొచ్చింది. లోయ పరిస్థితి ఎలా ఉందో షిండే ప్రకటన రుజువు అని పేర్కొంది. దీని కారణంగా పర్యాటకులు జమ్మూ, కాశ్మీర్ చుట్టూ ఎటువంటి భయం లేకుండా తిరుగుతున్నారని పేర్కొంది. షిండే మాటలను కాంగ్రెస్ పట్టించుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటువాదం వెన్ను విరిగిపోయింది. ఎర్రకోట నుండి లాల్ చౌక్ వరకు త్రివర్ణ పతాకం రెపరెపలాడుతుంది. తీవ్రవాదం, రాళ్ల దాడి పరిస్థితులు మారిపోయాయి. బుల్లెట్లు కాల్చే చోట క్రికెట్ జరుగుతుందని ఆయన అన్నారుఇదిలావుంటే, ఆర్టికల్ 370 రద్దు తర్వాత, కాశ్మీర్‌లో రాళ్లదాడి నుండి ఉగ్రవాదుల నిర్మూలన వరకు చర్యలు తీసుకున్నారు. 2015 నుండి 2019 వరకు 5,063 రాళ్లదాడి సంఘటనలు నమోదయ్యాయి. అయితే 2019-2023 మధ్య 434 సంఘటనలు మాత్రమే నమోదయ్యాయి. అదే సమయంలో, 2015-2019 మధ్య 740 మంది ఉగ్రవాదులు మరణించగా, 2019-2023 మధ్య 675 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. భద్రతా సిబ్బంది ప్రాణనష్టం గురించి మాట్లాడితే, 2015-2019 మధ్య 379 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు. 2019-2023 వరకు 146 మంది సైనికులు మాత్రమే అమరులయ్యారు. మోదీ హయాంలో కాశ్మీర్ లోయ పూర్తిగా కోలుకుని సాధారణ స్థితికి చేరుకుంటోందని భారతీయ జనతా పార్టీ నేతలు చెబుతున్న మాట.

# బీసీల గణన దిశగా అడుగులు

హైదరాబాద్: దేశంలో బీసీ జనాభా ఎక్కువ. కేంద్రంలో అయినా, రాష్ట్రాల్లో అయినా పార్టీల గెలుపు ఓటముల్లో బీసీలే కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే రిజర్వేషన్ల విషయంలో మాత్రం వెనుకబడుతున్నారు. దీంతో ఇది రాజకీయ అంశంగా మారింది. ఈ క్రమంలో 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందే దేశంలో కొన్ని రాష్ట్రాల్లో బీసీ జనగణన చేపట్టారు. ఇక లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ.. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా బీసీ గణన చేపడతామని హామీ ఇచ్చింది. అయితే బీసీ కుల గణనపై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ మాత్రం మౌనం వహిస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా బీసీ కుల గణన చేపట్టడం లేదు. బిహార్, హరియాణా, ఆంధ్రప్రదేశ్‌లో బీసీ గణన చేపట్టారు. ఈ క్రమంలో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తాము అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అయితే 2019లోనే బీసీ సంఘం నేత ఎర్ర సత్యనారాయణ బీసీ కులగణన చేపట్టాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం మూడు నెలల్లో బీసీ కులగణన చేసి నివేదిక ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. బీసీ గణనకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తరఫు న్యాయవాది, అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. దీంతో తాజా ఉత్తర్వులు ఇచ్చి.. పిటిషన్‌పై కోర్టు విచారణను ముగించింది. భారతదేశంలో కులాల ప్రస్తావన నేటిది కాదు.. చాలా ఏళ్లుగా భారత దేశంలో బలంగా నాటుకుపోయాయి. దేశంలో ఉన్న జనాభాలో సగానికిపైగా కులం ఆధారంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారు. బాధితులకు ఉపశమనం కలిగించేలా రాజ్యాంగ నిర్మాత బీఆర్. అంబేద్కర్ రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలో పొందుపర్చారు. అందులో భాగంగానే మొదటగా షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించారు. అనంతరం వెనుకబడిన తరగతులకు, ఈ మధ్యకాలంలో అగ్రకుల పేదలకు సైతం రిజర్వేషన్లు అందుతున్నాయి. ఎవరి కుల దామాస ప్రకారం వారు హక్కులు పొందటమే ప్రజాస్వామిక సామాజిక న్యాయమని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన. దేశవ్యాప్తంగా బీసీల జనాభా 70 కోట్లకు పైమాటే ఉండగా మొత్తం జనాభాలో ఇది 56% పైగానే ఉంటుందని అంచనా. అయితే ఇప్పటికీ మన దేశం 90 సంవత్సరాల నాటి లెక్కల ఆధారంగానే రిజర్వేషన్లను కొనసాగిస్తుంది. ఈ నేపథ్యంలో సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు నష్టపోతున్నాయి. కులాల లెక్కలతోనే బీసీల అసలు జనాభా తెలిసే అవకాశం ఉంటుంది. అందుకే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ వస్తుంది. పదేళ్లకోసారి జనాభాను లెక్కిస్తున్నా అందులో స్పష్టమైన సమాచారాన్ని సేకరించడం లేదు. అందుకే ఇప్పటికైనా కులగణన చేపట్టి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడ్డ బీసీ కులాల ప్రజలకు న్యాయం చేయాలని బీసీలు కోరుతున్నారు.

# రేవంత్ కు మాస్ ఇమేజ్...

హైదరాబాద్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన సన్నిహితుల వద్ద తరచూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నోటి నుంచి ఒక మాట వినిపిస్తూ ఉంటుందని చెబుతారు. "ముఖ్యమంత్రిని అవుతామని ఎప్పుడైనా అనుకున్నామా? దేవుడి పుణ్యమా అని అయ్యాం, భయపడుతూ కూర్చుకుంటే ఏ పని చేయలేం. వచ్చిన అవకాశాన్ని విడిచిపెట్టొద్దు. పాలనలో మన ముద్ర వేద్దాం. అనవసర భయాలకు పోవద్దు. మంచి చేసుకుంటూ పోదాం. ఏది జరిగితే అది జరుగుతుంది" అని వ్యాఖ్యానించేవారట. నిజానికి ఈ తెగింపే రేవంత్ కు కొత్త ఇమేజ్ ను తెచ్చి పెట్టిందని చెప్పాలి. రేవంత్ పాలనను తీసుకుంటే.. బోలెడన్ని సంచలన నిర్ణయాలు తీసుకోవటం కనిపిస్తుంది. అధికారంలో ఉన్నంత కాలంలో పాలన మీద తనదైన ముద్ర వేయాలన్న తహతహ రేవంత్ లో ఎక్కువగా కనిపిస్తుందని చెబుతారు. అందుకు తగ్గట్లే రేవంత్ తీరు ఉందని చెప్పాలి. ఎయిర్ పోర్టు మెట్రో కావొచ్చు.. మూసీ ప్రక్షాళన కావొచ్చు.. ఫోర్త్ సిటీ కావొచ్చు. ఇలా చెప్పుకుంటూ పోతే వినూత్నంగా ప్లాన్ చేసి.. హైదరాబాద్ ఇమేజ్ ను గ్లోబల్ చేయాలన్న పట్టుదల కనిపిస్తూ ఉంటుంది. ఈ కోవలోనే తెర మీదకు వచ్చింది హైడ్రా. విపత్తుల వేళ సాయం చేసేందుకు.. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ ముఖ్యమంత్రి రేవంత్ కు సరికొత్త ఇమేజ్ ను తీసుకురావడమే కాదు.. ఆయనకు ఒకలాంటి మాస్ ఇమేజ్ ను తీసుకొచ్చింది. రేవంత్ ప్రభుత్వ గ్రాఫ్ విషయానికి వస్తే.. కొన్నిసార్లు అప్.. మరికొన్నిసార్లు డౌన్ అన్న పరిస్థితి. అందుకు భిన్నంగా హైడ్రా పుణ్యమా అని రేవంత్ సర్కారు గ్రాఫ్ దూసుకెళుతోంది. హైడ్రా పని తీరు మీద ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు మాత్రమే కాదు.. పాలకులు సైతం ఫోకస్ చేస్తున్నారు. హైడ్రా వ్యవస్థ ఏర్పాటు వివరాల్ని తమకు షేర్ చేయాలని కోరుతున్న పరిస్థితి. ఏదైనా మంచి పని చేయాలన్నప్పుడు చాలానే అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయి. అలాంటి వాటిని పట్టించుకోకుండా.. పని మీదే ఫోకస్ తప్పించి.. మరే ఇతర ఒత్తిళ్లకు తలొగ్గదన్న సీఎం రేవంత్ క్లారిటీతో హైడ్రా అధికారులు దూసుకెళుతన్నారు. మొత్తంగా పాలనలో కొన్ని ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న రేవంత్ సర్కారు కు.. హైడ్రా అనుకోకుండా ఒక ఆయుధంగా మారటమే కాదు.. వ్యక్తిగతంగా సీఎం రేవంత్ ఇమేజ్ ను భారీగా పెంచేసిందని చెప్పాలి.

# తెలంగాణలో 4090కి పెరిగిన మెడికల్ సీట్లు

హైదరాబాద్: తెలంగాణలో మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మెదక్, యాదాద్రి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీలకు కేంద్ర ఆరోగ్యశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తు చేసిన 4 మెడికల్ కాలేజీలకు పర్మిషన్ ఇవ్వాలని నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఆదేశించింది. కాలేజీలకు అనుమతిపై తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ఆరోగ్య శాఖ లేఖ పంపించింది. మంజూరైన నాలుగు కాలేజీలలో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, తెలంగాణలో మరో 200 మెడికల్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే గద్వాల్, నారాయణపేట్, ములుగు, నర్సంపేట్ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్‌అనుమతి రావడం తెలిసిందే. కేంద్రం తాజా నిర్ణయంతో రాష్ట్రంలో మొత్తం 8 కాలేజీల్లో కలిపి 400 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కొత్త సీట్లతో కలుసుకుని తెలంగాణలో ప్రభుత్వ కాలేజీల్లోని మొత్తం సీట్ల సంఖ్య 4090 కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 8 కాలేజీలకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేసింది. జూన్‌లో ఈ కాలేజీల పరిశీలనకు వచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ అధికారులు, ఇక్కడ అవసరమైన సౌకర్యాలు లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, సౌకర్యాలు లేకుండా తాము అనుమతులు ఇవ్వలేమని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. కొత్త కాలేజీల మంజూరు కోసం చేయాల్సిన ఏర్పాట్లకు అవసరమైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. గతంలో నేషనల్ మెడికల్ కమిషన్ చూపించి లోపాలను సవరించిన తెలంగాణ ప్రభుత్వం ఫస్ట్ అప్పీల్‌కు వెళ్లింది. ఆ అప్పీల్ కారణంగా గద్వాల్, నారాయణపేట్, ములుగు, నర్సంపేట్ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ పర్మిషన్ ఇచ్చింది. మిగిలిన 4 కాలేజీలకు పర్మిషన్ మాత్రం రాలేదు. దాంతో మిగతా 4 కాలేజీలకు అనుమతులపై తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఎప్పటికప్పుడూ మానిటర్ చేశారు. మహేశ్వరం, కుత్బుల్లాపూర్, యాదాద్రి, మెదక్ మెడికల్ కాలేజీలకు స్టాఫ్‌ను నియమించారు. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో తొలుత ఆ నాలుగు మెడికల్ కాలేజీల్లోని ఖాళీలను నింపి, ఆ తర్వాతే మిగిలిన కాలేజీల్లోకి సిబ్బందిని బదిలీ చేసింది ప్రభుత్వం. ప్రొఫెసర్ల కొరతను అధిగమించేందుకు అర్హత ఉన్న వారికి ప్రమోషన్లు ఇచ్చారు. మెడికల్ కాలేజీతో పాటు అక్కడి హాస్పిటల్‌లో ఉండాల్సిన లాబోరేటరీ, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇలా ఎన్ఎంసీ లేవనెత్తిన అన్ని లోపాలను సవరించి కేంద్ర ఆరోగ్యశాఖకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు సెకండ్ అప్పీల్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా ఆదేశాలతో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, ఇతర ఆఫీసర్లు, డాక్టర్ల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆరోగ్యశాఖ, ఎన్ఎంసీ అధికారులను కలిశారు. కాలేజీల ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని, ఇంకేమైనా అవసరం ఉంటే అవి కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలోనే మొత్తం అన్ని కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. లెటర్ ఆఫ్ పర్మిషన్ జారీచేయాలని ఎన్ఎంసీని ఆదేశించింది. కొత్తగా మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కృతజ్ఞతలు తెలిపారు. కాలేజీల ఏర్పాటు కోసం సకాలంలో అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, అడిషనల్ డీఎంఈ, ఇతర ఉన్నతాధికారులను మంత్రి దామోదర అభినందించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను డెవలప్ చేసి, ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# ఒక్క మిస్డ్ కాల్ తో బీజేపీ సభ్యత్వం

హైదరాబాద్: ఒక్క మిస్డ్ కాల్ తో భారతీయ జనతాపార్టీ, అనుబంధ సంస్థలలో సభ్యత్వం పొందవచ్చునని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ జీ తెలిపారు. మలక్ పేట నియోజకవర్గం శాలివాహన నగర్ ఎస్ బీఐ కాలనీ కమ్యూనిటీ హాలులో భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ సభ్యత్వ నమోదు కోసం టోల్ ఫ్రీ నంబర్ 18002662020 కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే సభ్యత్వ నమోదు జరిగిపోతుందన్నారు. "ఘరఘర్, గావ్ గావ్" నినాదంతో కార్యకర్తలు ముందుకు సాగి పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలని పిలుపు నిచ్చారు. తెలంగాణలోరామరాజ్యం స్థాపన కోసం నడుం బిగించి పోరాడాలన్నారు. ఏ స్వార్థం లేకుండా పోరాడిన వాళ్లే నిజమైన బీజేపీ కార్యకర్తలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి. నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ. కార్పొరేటర్లు కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి,.భాగ్యలక్ష్మి, గజాఆనంద్ గౌడ్,కొత్త కాపు రవీందర్ రెడ్డి, వీరేందే బాబు,సహదేవ్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి,నరసింహ,గోపి,హరి గౌడ్,మంజుల రెడ్డి,రమణ సింగ్,భారత్,దీనిష్ గౌలికర్, ఆశిష్ బిజెపి నాయకులు కార్యకర్తలు, మహిళా మోచ నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పీఏసీ ఫైట్

హైదరాబాద్: తెలంగాణలో హాట్ టాపిక్.. పీఏసీ ఛైర్మన్ అంశం. అవును.. నిన్నటి నుంచి పీఏసీ ఛైర్మన్ పదవిపై రాజకీయ రగడ కంటిన్యూ అవుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం నైతికమా? అనైతికమా? టెక్నికల్ టర్న్లు ఏం చెబుతున్నాయి? పబ్లిక్ అకౌంట్స్ కమిటీ.. సింపుల్‌గా ఖంఅ.. ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమిస్తూ అసెంబ్లీ సెక్రటరీ బులెటిన్ రిలీజ్ చేశారు. నిజానికి అసెంబ్లీ రూల్స్ ప్రకారం బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు సభ్యులను ఖంఅకి ఎన్నుకోవాల్సి ఉంది. ఇప్పుడు కాంగ్రెస్ ముగ్గురు సభ్యులను ఎన్నుకుంది. వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, అరికెపూడి గాంధీని ఎన్నుకుంది. అయితే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో. ఇదేక్కడి న్యాయం అని ప్రశ్నిస్తోంది బీఆర్ఎస్.. ఇది సభా సంప్రదాయాలు, సభా మర్యాదలు, సభా నియమావళిని పట్టించుకోనట్టే అంటూ అంతెత్తు ఎగిరిపడుతోంది. నిజానికి పీఏసీ ఛైర్మన్ పదవిని ప్రధాన ప్రతిపక్షానికి ఇస్తారు. కానీ ఇప్పుడు టెక్నికల్‌గా అరికెపూడి గాంధీ బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే. ఆయనపై అనర్హత వేటు వేయాలని ఇప్పటికే స్పీకర్‌ను కోరింది బీఆర్ఎస్ పార్టీ.. కాబట్టి.. ఆయన పేరుకు కాంగ్రెస్‌లో ఉన్నా.. ఆయన బీఆర్ఎస్‌కు చెందిన సభ్యుడే.. అందుకే ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తికే ఇచ్చాం కదా అని చెప్పకనే చెబుతోంది కాంగ్రెస్ పార్టీ.. నిజానికి ఇది బీఆర్ఎస్‌కు మాస్టర్ స్ట్రోక్.. నిజానికి బీఆర్ఎస్ హరీష్‌రావు పేరును సలహా చేసింది. అయితే వ్యూహాత్మకంగా గాంధీ పేరును తెరపైకి తీసుకొచ్చి ఆయనకు పదవిని కట్టబెట్టింది. అయితే తనకిచ్చిన పీఏసీ ఛైర్మన్‌గా బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాన నంటున్నారు అరికెపూడి గాంధీ.. ప్రస్తుతం తాను ప్రతిపక్ష పార్టీలోనే ఉన్నాను కాబట్టి.. పీఏసీ పదవి ఇచ్చారని చెబుతున్నారు. అంతేకాదు అనర్హత వేటుపై కూడా ఆయన స్పందించారు. కోర్టు నిర్ణయం ఏదైనా తాను గౌరవిస్తానని చెబుతున్నారు. అయితే ఈ విషయంలో నిజంగా బీఆర్ఎస్‌కు విమర్శించే హక్కు ఉందా? ఈ క్వశ్చన్‌కి ఆన్సర్ లేదనే చెప్పాలి. ఎందుకంటే ఇలాంటి సంస్కృతిని స్టార్ట్ చేసింది బీఆర్ఎస్ పార్టీనే కాబట్టి. 2018 ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేసీఆర్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతలకు పీఏసీ పదవిని ఇవ్వలేదు కనీసం కోరినా పట్టించుకోలేదు. అప్పుడు బీఆర్ఎస్‌కు మిత్రపక్షంగా ఉన్న మజ్లీస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీకే పీఏసీ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు.

ఇదేక్కడి న్యాయమని ప్రశ్నిస్తే.. అసలు కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదానే లేదని వాదించింది బీఆర్ఎస్.. ఆ తర్వాత కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకుంది. మరి ఇప్పుడేమో కాంగ్రెస్ అన్యాయం చేసిందంటూ నెత్తి నోరు బాదుకుంటుంది. అసలు ఈ ట్రెండ్‌ను సెట్ చేసింది మీరే కదా అనే విషయాన్ని మర్చిపోతే ఎలా అంటున్నారు కాంగ్రెస్ నేతలు. తప్పును తప్పు అని చెప్పడానికి ఓ అర్హత ఉండాలి.. మనం ఏ తప్పు చేయనివారమై ఉండాలి. అప్పుడే మనకు అడిగే హక్కు ఉంటుంది. దబాయించేందుకు అధికారం ఉంటుంది. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ ఆ పరిస్థితిలో లేదు.. బీఆర్ఎస్ ఒక మాట మాట్లాడితే.. కాంగ్రెస్ నేతలు వంద మాట్లాడుతున్నారు. ఆ రోజు మీరు చేసినప్పుడు రైట్ అయినప్పుడు. ఈ రోజు రాంగ్ ఎలా అవుతుంది అని నిలదీస్తున్నారు. టెక్నికల్‌గా మేము చేసింది తప్పు కాదు. రాజ్యాంగం ప్రకారమే నడుచుకున్నామన్న లాజిక్‌ను అయితే తెరపైకి తీసుకొస్తున్నారు కాంగ్రెస్ నేతలు..

# సర్పంచ్ ఏకగ్రీవం...

వరంగల్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ కూయకముందే ఆ గ్రామంలో సర్పంచ్ ఎన్నిక పూర్తయ్యింది. గ్రామస్తులంతా ఏకమై సర్పంచ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామానికి సంబంధించిన అవసరాలు తీర్చడంతో పాటు గ్రామంలో మూడు గుళ్లు కట్టించి, ఆ గుడిలో నిర్వహించే పండుగనాడు ప్రతి ఇంటికి ఖర్చుల నిమిత్తం వెయ్యి చొప్పున ఇవ్వాలని తీర్మానం చేసుకున్ని సర్పంచ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో సర్పంచ్ గా ఎన్నికైన వ్యక్తి గ్రామంలో ఏకంగా విజయోత్సవ సంబరాలు కూడా నిర్వహించారు. ఈ ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చెరువుకొమ్ము తండాలో చోటు చేసుకుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా చెరువుకొమ్ము తండా చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లా చెరువుకొమ్ము తండాలో సుమారు 883 మంది వరకు జనాభా ఉండగా.. 700 మంది వరకు ఓటర్లు ఉన్నారు. కాగా గత పాలకవర్గం హయాంలో నిధుల లేమి కారణంగా గ్రామంలో పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టలేదు. దీంతో గ్రామంలో చాలావరకు సమస్యలు పేరుకుపోగా.. జనాలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అంతేగాకుండా గ్రామ దేవతలైన బొడ్రాయి, కనకదుర్గమ్మ గుడి పండుగలు చేయకపోవడం, ఊరిలో హనుమంతుడి విగ్రహం లేకపోవడం వల్ల గ్రామంలో అరిష్టాలు జరుగుతున్నాయని అక్కడి ప్రజల్లో బలంగా పాతుకుపోయింది. దీంతో ఇటీవల గ్రామస్థులంతా సమావేశమయ్యారు. సమస్యలన్నింటిపై చర్చించారు. ఈ క్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గా పని చేసిన ధరావత్ బాలాజీ అనే వ్యక్తి గ్రామస్థులంతా ఒప్పుకుంటే తానే సర్పంచ్ గా నిలబడతానని అక్కడి ప్రజలకు చెప్పాడు. తనను ఏకగ్రీవంగా సర్పంచ్ చేస్తే గ్రామ సమస్యలు పరిష్కరించడంతో పాటు సొంత పైసలతో ఊరిలో బొడ్రాయి, పోచమ్మ తల్లి, ఆంజనేయుడికి గుళ్లు కట్టిస్తానని, విగ్రహాలు పెట్టిస్తానని మాటిచ్చాడు. బొడ్రాయి పండుగ ఖర్చు కోసం గడప గడపకు రూ.1000 చొప్పున పంచుతానని హామీ ఇచ్చాడు. తనను ఏకగ్రీవం చేస్తే తాను ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తానని చెప్పాడు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకుండా, తనను ఏకగ్రీవం చేయాలని ధరావత్ బాలాజీ కండీషన్ పెట్టగా.. అందుకు గ్రామస్థులంతా ఒప్పుకున్నారు. ఇదిలాఉంటే సర్పంచ్ గా ఏకగ్రీవం చేశాక మాట తప్పితే ఎలా అని కొందరు గ్రామస్థులు బాలాజీని ప్రశ్నించారు. దీంతో ఎన్నికలు రాకముందే తాను చెప్పిన పనులన్నీ ప్రారంభించి, పూర్తి చేస్తానని ధరావత్ బాలాజీ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఊళ్లో వాళ్లంతా గ్రామంలో మీటింగ్ పెట్టుకుని అగ్రిమెంట్ పేపర్ రాసుకున్నారు. సర్పంచ్ అభ్యర్థి ధరావత్ బాలాజీతో పాటు గ్రామస్తులు అగ్రిమెంట్ పేపర్ లో సంతకాలు చేశారు. గ్రామస్థులు కోరిన మేరకు మూడు గుళ్లు, పండుగల నాడు ఇంటికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్న ధరావత్ బాలాజీ గ్రామస్థులకు ఒక షరతు పెట్టాడు. పంచాయతీ ఎలక్షన్స్ సమయంలో కేవలం బాలాజీ ఇంటి నుంచి మాత్రమే నామినేషన్ వేయాలని, దీనిని అతిక్రమించి ఎవరైనా నామినేషన్ వేస్తే వారికి రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా అగ్రిమెంట్లో రాయించాడు. ఒప్పంద పత్రంపై ఇరుపక్షాలవారు సంతకాలు చేయగానే సర్పంచ్ అభ్యర్థితో పాటు గ్రామస్తులంతా రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకున్నారు. దీంతో ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా.. మంగళవారం ఉదయం స్థానిక రెవెన్యూ అధికారులు గ్రామంలో వివరాలు సేకరించారు.

# ఆక్రమణదారులు జైలుకు వెళ్లాల్సిందే

హైదరాబాద్: హైడ్రా పనితీరు భవిష్యత్ కార్యచరణపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ఆక్రమణదారులను అవసరమైతే జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ముందుగానే మేల్కొంటే మాత్రం మంచిదని సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన పోలీస్ అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి హైడ్రాపై కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణల వల్లే వరదలు వస్తున్నాయని తెలిపారు. వరదలతో పేదల జీవితాలు అతలాకుతలం అవుతున్నాయని అందుకే ప్రక్షాళన చేపట్టినట్టు తెలిపారు. చెరబట్టిన వారి నుంచి హైడ్రాతో చెరువులను విడిపిస్తున్నామన్నారు రేవంత్. అవసరమైతే ఆక్రమణదారులను జైలుకు పంపేందుకూ వెనకాడబోమన్నారు. ఆక్రమించుకున్న చెరువులను స్వచ్ఛందంగా వదులుకోవాలని ఆక్రమనదారులకు ఆఫర్ ఇచ్చారు. లేకపోతే చెరువులలోని అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతామని హెచ్చరించారు. నాలాల ఆక్రమణలను నిరభ్యంతరంగా కూల్చేస్తామన్న రేవంత్... ఆక్రమణలు తొలగించి మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. మూసీ నాలాల్లో ఉన్న శాశ్వత నివాసదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నివాసితులైన 11వేల మందిలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని భరోసా కల్పించారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలను రెగ్యులరైజ్ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇదే వేదికపై నుంచి పోలీసులకు వరాలు ప్రకటించారు. పోలీసుల పిల్లల కోసం రెండు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించబోతున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఒకటి వరంగల్‌లో రెండోది నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో 50 ఎకరాల్లో పోలీసుల పిల్లల కోసం రెసిడెన్షియల్ పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు రేవంత్ రెడ్డి. 50 ఎకరాల్లో వరంగల్‌లో మరో పోలీస్ స్కూల్ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. రాబోయే రెండేళ్లలో హైదరాబాద్‌లో పోలీస్ స్కూల్ ప్రవేశాలు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు ఉద్యోమనేది బాధ్యతమాత్రమే కాదని... భావోద్వేగమని అన్నారు. తెలంగాణను పునర్నిర్మించి, భవిష్యత్ తరాలకు బాటలు వేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు రేవంత్. ఏ సమస్య వచ్చినా ముందుగా అందుబాటులో ఉండేది పోలీసులేనని అందుకే వారు ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. తెలంగాణను కాపాడుకునేందుకే ఖాకీ డ్రస్సులనే విశ్వాసం ప్రజలకు కల్పించాలని అన్నారు రేవంత్. అదే టైంలో తెలంగాణ యువతను వ్యసనాల బారిన పడేస్తున్న డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. అందరిని చూస్తోంటే తెలంగాణ డ్రగ్స్ రహితంగా మారుతుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. డ్రగ్స్, గంజాయిపై ఉక్కు పాదం మోపుతామని... డ్రగ్స్ పేరు వింటేనే వెన్నులో వణుకు పుట్టాలని అన్నారు. కాస్మెటిక్ పోలీసింగ్ కాకుండా కాంక్రీట్ పోలీసింగ్ అవసరమన్నారు రేవంత్. ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే నేరస్తులకు కాదన్నారు. తెలంగాణ అభివృద్ధిలో పోలీసుల పాత్ర చాలా ముఖ్యమన్నారు రేవంత్ రెడ్డి. యువత ప్రాణత్యాగంతో సాధించుకున్న తెలంగాణ తొమ్మిదేళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొందన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదని గుర్తు చేశారు. అన్నింటినీ చూసిన ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని తెలిపారు. వారి దయతో ప్రజాప్రభుత్వ ఏర్పడిందని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేసినట్టు పేర్కొన్నారు రేవంత్. ఒక్కో వ్యవస్థను ప్రక్షాళన చేస్తూ వచ్చామని ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా ప్రక్షాళించామన్నారు. గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేసి నిరుద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేసారు.

**547 మంది ఎస్ ఐలు**

తెలంగాణలో నిరుద్యోగ యువకులు ఉత్సాహంతో పరీక్షలకు సిద్ధం అవుతున్నారని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం పెట్టుబడులు తీసుకురావడం, ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా రైతన్నలు, నేతన్నలు, గీతన్నలను ఆదుకుంటోందన్నారు రేవంత్. కేవలం 28రోజుల్లోనే 22 లక్షల 22 వేల 685 రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు వేసి రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. కడుపు కట్టుకుని నిధులు సేకరించి రుణమాఫీ చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని అభిప్రాయపడ్డారు... తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడెమిలో సబ్ ఇన్స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మొత్తం 547 మంది సబ్ ఇన్స్పెక్టర్లు తమ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకొని పరేడ్‌లో పాల్గొన్నారు.పోలీస్ అకాడమీ నుండి 547 మంది ఎస్‌ఐలు పాస్ అవుతున్నారు. వీరిలో మహిళా సబ్ ఇన్స్పెక్టర్లు 145 మంది. పురుష సబ్ ఇన్స్పెక్టర్లు- 402 మంది. ఈ మొత్తం 547 మంది సబ్ ఇన్స్పెక్టర్లలో 401 మంది సివిల్ సబ్ ఇన్స్పెక్టర్లుగా ఉన్నారు. ఏ ఆర్ఎస్‌ఐలు గా 71 మంది, టీజీఎస్‌పీ (ఖీూఎ)లు 29 మంది, ఐటీసీ ఎస్‌ఐలు 22 మంది ఎస్‌ఐలు ఉన్నారు.547 మంది ఎస్‌ఐలో ఎక్కువ మంది గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. దాదాపు 472 మంది గ్రాడ్యుయేట్ లు ఉండగా , పోస్ట్ గ్రాడ్యుయేట్స్ లు 75 మంది ఉన్నారు. ఈ 547 మంది సబ్ ఇన్స్పెక్టర్లలో 248 మంది బిటెక్ విద్యార్హత కలిగి ఉన్నారు. 221 మంది డిగ్రీ వరకు చదువుకున్నారు. 26 మంది ఎంటెక్ పూర్తి చేయగా, 18 మంది ఎంబీఏ చదువుకున్నారు. ఈ పాసింగ్ అవుట్ పరేడ్‌కు పరేడ్ కమాండర్‌గా మహిళా సబ్ ఇన్స్పెక్టర్ పల్లి భాగ్యశ్రీ నేతృత్వం వహించారు. పరేడ్ 26 నుండి 30 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు అత్యధికంగా ఉన్నారు. వీరిలో మొత్తం 283 మంది 26 నుండి 30 ఏళ్ల వయసు వారు ఉండగా, 25 సంవత్సరాల లోపు వయసు కలిగిన అభ్యర్థులు 182 మంది ఉన్నారు. 58 మంది ఎస్‌ఐలు 31-35 వయసు వారు ఉండగా, 24 మంది 36-42 ఏళ్ల వయసు వారు ఉన్నారు.

**11 కోట్ల విరాళం ఇచ్చిన తెలంగాణ పోలీసులు:**

వరదల కారణం నష్టాలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీసుల తరపున ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.11,06,83,571ల విరాళం అందజేశారు. ఎస్సై పాసింగ్ పరేడ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డికి డీజీపీ జితేందర్, శివధర్ రెడ్డి తదితరులు చెక్‌ను అందజేశారు.

## రేవ్ పార్టీ 26 మంది అరెస్ట్

హైదరాబాద్: హైదరాబాద్ లో రేవ్ పార్టీ దురాచారం ఇంకా కొనసాగుతూనే ఉంది. రాత్రంగా మత్తులో ఊగి తేలడం కోసం సంపన్నులైన యువత ఈ రేవ్ పార్టీలకు విరివిగా హాజరవుతున్నారు. ఇందులో మందుతో పాటు మగువ, మత్తు పదార్థాలు కూడా విచ్చలవిడిగా వాడుతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాజాగా గచ్చిబౌలిలో ఓ రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు.ఓ గెస్ట్ హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ రేవ్ పార్టీ నిర్వాహకులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అని గుర్తించారు. మాదాపూర్ ఎస్ఓటీ (స్పెషల్ ఆపరేషన్స్ టీమ్) పోలీసులు ఈ రేవ్ పార్టీని భగ్నం చేశారు. దాదాపు 26 మంది యువత ఈ రేవ్ పార్టీలో పాల్గొన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. వీరిలో 8 మంది అమ్మాయిలు, 18 మంది అబ్బాయిలను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయితో పాటు భారీ స్థాయిలో మద్యం కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వీరు పెద్ద ఎత్తున గంజాయి, మద్యం సేవిస్తున్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. ఈ రేవ్ పార్టీ ఎవరు నిర్వహించారు.. గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది.. వీరు ఇంకా గతంలో ఎన్నిసార్లు ఇలా రేవ్ పార్టీలు నిర్వహించారు.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ పార్టీ వెనుక ఉన్న వారిని పోలీసులు గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

## సింగరేణి కార్మికుల డిపెండెంట్ల నిరసన

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండం సింగరేణి సంస్థ అర్జీ వన్ జీఎం ఆఫీస్ ఎదుట కార్మికుల డిపెండెంట్లు నిరసన ప్రదర్శన చేశారు. మారు పేర్లతో విధులు నిర్వహించే కార్మికుల రిటైర్మెంట్ తర్వాత వారి పిల్లలకు సంస్థలో ఉద్యోగాలు కల్పించాలని ప్ల కార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్మికుల మారు పేర్లు, విజిలెన్స్ ఎంక్వయిరీ పేరుతో యాజమాన్యం వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వడంలో జాప్యం చేస్తుందని ఆందోళన చేపట్టారు. అంతేగాకుండా కార్మిక సంఘాల నాయకులు ఉపాధి కల్పించడంలో న్యాయం చేయాలని డిపెండెంట్స్ కోరుతున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయకుండా... ఉద్యోగం కల్పించాలని కోరారు. ఇప్పటికే ఆర్థికంగా, మానసికంగా మా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి లో ఉద్యోగాలు వస్తాయని కార్యాలయాల చుట్టూ తిరిగిన అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# వలస ఎమ్మెల్యేలల్లో వణుకు...

వరంగల్: హైకోర్టు ఆదేశాలతో తెలంగాణలో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలనే హైకోర్టు ఆదేశాలు?. వలస ఎమ్మెల్యేల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కాలయాపన జరిగినట్లు.. ఇప్పుడు కూడా పదవీకాలం పూర్తయ్యేవరకు గడిపేయొచ్చని భావించిన ఎమ్మెల్యేలకు హైకోర్టు తీర్పుతో ఎదురుదెబ్బ తగిలినట్లైంది. వేటు కత్తి వేలాడుతుండటం? చట్ట ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకుంటే? మూడు అసెంబ్లీ స్థానాలకు ఆరు నెలల్లోనే ఉప ఎన్నిక అనివార్యమయ్యే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఐతే స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది సస్పెన్స్‌గా మారగా, హైకోర్టు తీర్పుతో పర్యావసానాలపై మిగిలిన ఏడుగురు వలస ఎమ్మెల్యేలు టెన్షన్ పడుతున్నట్లు చెబుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకొని ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేయాలని చూసిన కాంగ్రెస్ పార్టీ లక్ష్యం నెరవేరలేదు. ఇప్పుడు తాజాగా హైకోర్టు ఇచ్చిన డైరెక్షన్ అధికార పార్టీకి ఝలక్ ఇచ్చినట్లైందంటున్నారు. బీఆర్ఎస్ నుంచి మొత్తం 26 మందిని కాంగ్రెస్‌లోకి చేర్చుకోవాలని ప్రభుత్వ పెద్దలు ప్లాన్ చేయగా, ప్రస్తుతానికి 10 మంది మాత్రమే హస్తం గూటికి చేరారు. ఐతే వీరిలో ముగ్గురిపై తక్షణం చర్యలు తీసుకోవాలని గతంలోనే స్పీకర్‌కు, ఆ తర్వాత హైకోర్టుకు నివేదించింది బీఆర్ఎస్. అనర్హత వేటు వేయడంలో తాత్సారం చేస్తున్న స్పీకర్ తక్షణం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించాల్సిందిగా కోరుతూ హైకోర్టుకు వెళ్లింది బీఆర్ఎస్.ఆ పార్టీ అనుకున్నట్లే అనర్హత వేటుపై తీసుకోబోయే చర్యలకు సంబంధించి షెడ్యూల్ రూపొందించి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ అసెంబ్లీ కార్యదర్శికి కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో కాంగ్రెస్ పెద్దలు కంగుతిన్నారు. పార్టీ మారిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలను ఎలా కాపాడుకోవాలనే వ్యూహ రచన చేస్తున్నారు. మరోవైపు కారు దిగిన మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలకు ఏ రకమైన భరోసా ఇవ్వాలన్నదానిపై అధికార పార్టీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారట. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి 10 మంది కాంగ్రెస్‌లోకి జంప్ చేయగా, వీరిలో ముగ్గురిపై ఏదో ఒక నిర్ణయం వెల్లడించాలని స్పీకర్‌ను ఆదేశించింది హైకోర్టు. దీంతో ఈ ముగ్గురితోపాటు మిగిలిన ఏడుగురు టెన్షన్ పడుతున్నారని అంటున్నారు. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్లమెంట్ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ లో చేరారు. కడియం శ్రీహరి కుమార్తెకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇప్పించుకోగా, దానం నాగేందర్ ఏకంగా సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి దొరికిపోయారు. అటు తెల్లం వెంకట్రావు సైతం లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించారు. దీంతో ఈ ముగ్గురిని టార్గెట్ చేసింది గులాబీదళం. వీరిపై కోర్టును ఆశ్రయించి.. అనర్హత వేటు వేయించేందుకు వాదనలు విన్పించింది బీఆర్ఎస్. దీంతో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలనే రకంగా డైరెక్షన్ ఇచ్చింది హైకోర్టు.ఇంకా డివిజన్ బెంచ్ కు వెళ్లేందుకు ? సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సైతం ఎమ్మెల్యేలకు అవకాశం ఉన్నా? అది పెద్దగా ఉపయోగ ఉండకపోవచ్చనే వాదనే విన్పిస్తోంది. గతంలో మహారాష్ట్ర ఎమ్మెల్యేల విషయంలో ఇదే రకంగా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు సైతం డైరెక్షన్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు న్యాయనిపుణులు. దీంతో ఈ ముగ్గురిపై వేటు ఖాయమని.. ఉప ఎన్నికలు తప్పవనే చర్చ జోరుగా సాగుతోంది. అదే జరిగితే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు చెరో స్థానాన్ని గెలుచుకునే అవకాశాలున్నాయనే ఊహాగానాలు సాగుతున్నాయి.ఇదిలా ఉంటే మిగిలిన ఏడుగురిపై మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎలాంటి ఆధారాలను బీఆర్ఎస్ కు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు ఫిరాయింపు ఎమ్మెల్యేలు? బహిరంగంగా ఎక్కడా కాంగ్రెస్ కు మద్దతు పలికినట్లు కనపడకుండా? ప్రభుత్వాన్ని భుజాన మోస్తున్నారు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరిపై వేటు పడినా, మిగిలిన వారందరూ అదే శిక్షను ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ పరిస్థితుల్లో ఎవరు బలైపోతారోనని పార్టీ మారిన ఎమ్మెల్యేలు భయపడుతున్నట్లు చెబుతున్నారు.వేటు నుంచి తప్పించుకోవాలంటే ముందుగా రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్లడం ఒక్కటే ఎమ్మెల్యేలకు ప్రత్యామ్నాయంగా చెబుతున్నారు. ఐతే పార్టీ మారిన 10 మందిలో ఒకరిద్దరికి తప్ప మిగిలిన నేతలు అందరికీ నియోజకవర్గంలో పరిస్థితులు అంత సానుకూలంగా లేవంటున్నారు. దాదాపు అందరూ కాంగ్రెస్ క్యాడర్ నుంచి సహాయ నిరాకరణ ఎదుర్కొంటుండటం వల్ల తమ పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అన్నట్లు తయారైందని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు ఎమ్మెల్యేలు. జంపింగ్ ఎమ్మెల్యేల్లో దాదాపు అందరూ వ్యతిరేకత ఎదుర్కొంటుండం వల్ల ఉప ఎన్నికలను ఎదుర్కొనే విషయంపై తర్జనభర్జన సాగుతోంది. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి ఇన్‌చార్జి సరితా తిరుపతయ్యతోను, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితోనూ విభేదాలు కంటిన్యూ అవుతున్నాయి. అదే విధంగా చేవెళ్లలో ఎమ్మెల్యే యాదయ్యకు, కాంగ్రెస్ నేత భీం భరత్ కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఇక మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డికి పొసగడం లేదు. దీనికితోడు ఇప్పుడు అనర్హత కత్తి వేలాడుతుండటం వల్ల ఈ క్లిష్ట పరిస్థితి నుంచి ఎలా బయటపడాలనేదే జంపింగ్ ఎమ్మెల్యేలకు పెద్ద టాస్క్‌గా మారిందంటున్నారు.

## హెలిప్యాడ్ ను సైతం వదిలిపెట్టని మద్యం ప్రియులు...

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో నాయిని చెరువు కట్ట పైన మొన్న జరిగిన ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మంత్రులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రులు హెలిప్యాడ్ దిగడానికి నాయిని చెరువు కట్టపై స్థలాన్ని కేటాయించడం జరిగింది. అటువంటి నేలపైన ప్రతిరోజు సాయంత్రం వేళ చాలా రోజుల నుండి మద్యం సేవించడానికి అడ్డగా మారిన హెలిప్యాడ్, యువత రాత్రి అయితే చాలు నాయిని చెరువు కట్ట పైన మద్యం సేవించి బర్డే పార్టీలు చేసుకుంటూ మద్యం బాటిల్లను హెలిప్యాడ్ స్థలంలోనే పగలకొడుతూన్నారు

ఇదే చెరువుకట్టపై క్రీడా మైదానం కూడా ఏర్పాటు చేయడం జరిగినది, ప్రతి సంవత్సరం మహిళలు పిల్లలు ఈ స్థలంలో సద్దుల బతుకమ్మ ఆటలు ఆడడం జరుగుతుంది గణేషుని నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా గణనాధులను నాయిని చేరువు లోనే నిమజ్జనం చేయడానికి ఇదే చెరువు కట్ట మీది నుండి క్రేన్ ద్వారా నిమజ్జనం చేసుకోవడం జరుగుతుందని జమ్మికుంట పట్టణంలోని ప్రజలు ప్రతి ఒక్కరు ఇక్కడికి చేరుకుంటారని నిమజ్జనంలో భాగంగా కాళ్లకు చెప్పులు లేకుండా ప్రజలు భక్తిశ్రద్ధలతో వస్తారు కాబట్టి మద్యం బాటిళ్లు పగలగొట్టడం వలన ప్రజలకు గాయాలు అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పోలీస్ అధికారులు స్పందించి ఇట్టి పవిత్ర ప్రదేశంలో మద్యం సేవించకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి కట్టడి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు

# 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర అనుమతులపట్ల హరీష్‌రావు హర్షం

**ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ కల సాకారమైంది**

**మెడికల్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలి**

**మౌలిక వసతులు, బోధన సిబ్బంది కొరత లేకుండా చూదాలి**

**విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాలని విజ్ఞప్తి**

హైదరాబాద్: కేసీఆర్ మంజూరు చేసిన మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించడం సంతోషించదగ్గ విషయమని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. యాదాద్రి, మెదక్, మహేశ్వరం, కుత్బుల్లాపూర్ సహా గత నెలలో మెడికల్ కాలేజీల అనుమతి పొందిన ములుగు, నర్సంపేట, గద్వాల్, నారాయణపేట్ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తాజా అనుమతులతో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ కల సాకారమైందని హర్షం వ్యక్తం చేశారు.ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని.. దేశంలోనే రికార్డు నెలకొల్పిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి మొత్తం 8 మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం గత కేసీఆర్ ప్రభుత్వం నిధులు, భూ కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 8 కాలేజీలకు గాను కేవలం నాలుగు మెడికల్ కాలేజీలకు మాత్రమే గత నెల ఎన్ఎంసీ నుంచి అనుమతులు లభించాయని చెప్పారు.నిబంధనల ప్రకారం మౌలిక వసతుల ఏర్పాటు, బోధనా సిబ్బంది నియామకంలో ప్రభుత్వం విఫలమైందని ఎన్ఎంసీ అనుమతులు నిరాకరించిందని హరీశ్‌రావు తెలిపారు. జరిగిన తప్పును ఆలస్యంగా గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్ఎంసీ నిబంధనల మేరకు అన్ని మౌలిక వసతులు, బోధన సిబ్బందిని సమకూర్చుకుంటామని అనుమతి కోరుతూ కేంద్రానికి అప్పీల్ చేసిందన్నారు. దీన్ని పరిశీలించిన కేంద్రం అప్పీల్ అంగీకరించి, 4 మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని ఎన్ఎంసీకి మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. దీంతో ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున, మొత్తం నాలుగు కాలేజీల్లో 200 సీట్లు ఈ అకడమిక్ ఇయర్ కు అందుబాటులోకి రానున్నాయన్నారు. కొత్త సీట్లతో కలుపుకొని తెలంగాణలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే మొత్తం సీట్ల సంఖ్య 4,090 కు చేరుకుందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో కేవలం 850 ప్రభుత్వ మెడికల్ సీట్లు మాత్రమే ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 4,090 సీట్లకు చేరిందని హరీశ్‌రావు తెలిపారు. అంటే తొమ్మిదేళ్ల కాలంలో 5 రెట్లు పెంచిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి ఏటా పదివేల మందికి పైగా డాక్టర్లను తయారుచేసే రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందని చెప్పారు. ఓఃబా సీట్లలో లక్ష జనాభాకు 22 సీట్లతో దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. సమైక్య రాష్ట్రంలో వైద్యం, వైద్య విద్యలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన కేసీఆర్ గారు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తద్వారా పేద ప్రజల చెంతకే సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడంతో పాటు, తెలంగాణ బిడ్డలు వైద్య విద్య చదివే అవకాశాలను గణనీయంగా పెంచారన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే, తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక్కటి కూడా ఇవ్వలేదని తెలిపారు. అయినప్పటికీ రాష్ట్ర సొంత నిధులతోనే కొత్తగా మొత్తం 29 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. అందుకు అనుగుణంగా వేగవంతమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు.తెలంగాణ ఏర్పాటుకు ముందు 70 ఏండ్లలో రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగితే, స్వరాష్ట్రంలో 9 ఏండ్లలో 29 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇది కేసీఆర్ ఘనత, బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనత అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మకమైన పురోగతి అని అన్నారు. అరవై ఏళ్లలో సాధ్యం కాని అద్భుతాలను దశాబ్ద కాలంలోనే ఆవిష్కరించిందని పేర్కొన్నారు.తెలంగాణ పిల్లలు వైద్య విద్య కోసమని లక్షలు ఖర్చు చేసి.. చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని హరీశ్‌రావు తెలిపారు. విద్యార్థులు మాతృ భూమికి, తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ అవస్థలు పడాల్సిన అవసరం లేదన్నారు. ‘ ఒకవైపు ఎంబీబీఎస్ చదవాలనే ఆశ, మరోవైపు అర్థం కాని భాష, దేశం కాని దేశంలో గోస. ఇదంతా ఒకనాడు. కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలు, లోకల్ రిజర్వేషన్ వల్ల డాక్టర్ చదువాలనుకునే తెలంగాణ విద్యార్థులకు అవకాశాలు పెరిగాయి.’ అని హరీశ్‌రావు అన్నారు. వైట్ రెవల్యూషన్, గ్రీన్ రెవల్యూషన్, పింక్ రెవల్యూషన్, బ్లూ రెవల్యూషన్లకు తెలంగాణ నిలయంగా మారిందన్నారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వైట్ కోట్ రెవల్యూషన్ కు నాంది పలికిందని తెలిపారు.ఇక్కడ ఎంబీబీఎస్ చదివిన వారు రాష్ట్ర ప్రజలకే కాదు.. వివిధ దేశాల్లో వారు సేవలందించబోతున్నారని హరీశ్‌రావు తెలిపారు. తద్వారా తెలంగాణ ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేయబోతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ వైద్య విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా, వైద్య విద్య హబ్‌గా ఎదిగిందని చెప్పేందుకు గర్వపడుతున్నానని పేర్కొన్నారు. పెరిగిన మెడికల్ సీట్లను రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ కావాలనే కలను సహకారం చేసుకోవాలని కోరారు. మెడికల్ కాలేజీల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలని, మౌలిక వసతులు, బోధన సిబ్బంది కొరత లేకుండా చూస్తూ ప్రతి ఏటా ఎన్ఎంసీ అనుమతులు (రెన్యువల్) కొనసాగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా వైద్య విద్యార్థులకు నష్టం కలగకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా ఇన్చార్జి బడె నాగజ్యోతి**

**- ఇల్లు కూలిన, మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శ, ఆర్థిక సహాయం అందజేత**

తాడ్వాయి : అధిక వర్షాలకు నష్టపోయిన రైతులు ఇతర పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా ఇన్చార్జి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కాటాపూర్ లో ఇటీవల కురిసిన తుఫాను కారణంగా ఇల్లు రీలిన నిరుపేద ముస్లిం కుటుంబమైన అక్బర్ కుటుంబాన్ని, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గండు సీతమ్మ అను రెండు కుటుంబాలను పరామర్శించి, ఓదార్చి వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా సుమారు లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి అన్నారు. ఎన్నికల హామీల ప్రకారం, ఇండ్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రత్యమ్నాయ పంటల సాగుకు విత్తనాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఇందారపు లాలయ్య, మాజీ మండల అధ్యక్షులు నూశెట్టి రమేష్, మాజీ జెడ్పిటిసి రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు గండు బిక్షపతి, గ్రామ కమిటీ అధ్యక్షులు రంగు సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఎట్టి జగదీష్, నాయకులు కోట సురేష్, సాయిరి లక్ష్మీనరసు, మూతి రామారావు, ఇర్ప విజయ, అర్రెం కృష్ణ, సోషల్ మీడియా ఇన్చార్జి బందెల తిరుపతి, బందుల సారయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**